


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 39 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 26-08-2026 | పేజీలు: 10

## సిరా చుక్క

కలం కన్నీరు
సమాజం కోసం నిజాలను రాసిన
ఓ పాత్రికేయుడు,
నేడు పొట్టకూటి కోసం
భిక్షాటన చేయడం విషాదం.
కలం పట్టిన చేయి బిచ్చమెత్తడం
ఆయన వైఫల్యం కాదు..
సమాజ వైఫల్యం.అన్యాయాలను
ప్రశ్నించిన గొంతుకు
నేడు ఆదరించే చేయి కరువైంది.
ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన
వ్యక్తినిరోడ్డుపై వదిలేయడం
మనందరికీ సిగ్గుచేటు.
పాలకులారా..
మీ పదవుల వెనుక
జర్నలిస్టుల కలం కూడా ఉందని మర్చిపోవద్దు.
సానుభూతి మాటలు మాత్రమే కాదు,
గౌరవప్రదమైన జీవితం అందించాలి.
ఆర్థిక చేయూతతో
ఆయనకు అండగా నిలవాలి.
నిజాయితీగా పనిచేసిన కలానికి
సమాజం కృతజ్ఞత చూపాల్సిన
సమయం ఇది.
నేడు అతడిని ఆదుకోకపోతే
రేపు ప్రశ్నించే గొంతులు మూగబోతాయి.
కలం పట్టిన చేతికి ఆసరా..
మనందరి బాధ్యత!

– వారే వేణుగోపాల్. ..,
పాపన్న పేట
మెదక్ జిల్లా.

# మూసీ ప్రాజెక్టుకు వేగం

# భూసేకరణపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- భూసేకరణకు స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులకు ఆదేశం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్‌పై పక్కా నిబంధనలు
- ఫేజ్-2 పనులకు త్వరగా టెండర్లు పిలవాలని సూచన
- టీడీఆర్‌పై వారానికోసారి సమీక్ష.. తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి





**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న ఈ ప్రాజెక్టు పురోగతిపై మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, టెండర్లు, నిధులు, టీడీఆర్ తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### భూసేకరణకు పక్కా విధానం

మూసీ ప్రాజెక్టుకు అవసరమైన భూముల సమీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్ అంశాలపై నిబంధనలకు అనుగుణంగా సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు.భూసేకరణ విషయంలో భవిష్యత్‌లో న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, చట్టపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

### ఫేజ్-2 పనులకు త్వరగా టెండర్లు

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పనుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని సూచించారు.ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధుల కోసం తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

### టీడీఆర్‌పై వారానికోసారి సమీక్ష

ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంశంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ.. ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### అనుబంధ పనులపైనా ఫోకస్

మూసీ ప్రాజెక్టుతో అనుసంధానమైన మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయం పనులకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని సీఎం ఆదేశించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు భూసేకరణ, ఫేజ్-2 టెండర్లు, టీడీఆర్, అనుబంధ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం సమీక్ష స్పష్టం చేసింది.

# కొండా సురేఖకు షాక్?

## మంత్రి పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు

- కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ నివేదిక
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు నివేదిక అందజేసిన మల్లు రవి
- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం
- చిన్నారెడ్డిని ప్రణాళిక సంఘం ఛైర్మన్ పదవి నుంచి తప్పించాలని సూచన
- నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ కీలక నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికను క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డిని ప్రణాళిక సంఘం ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం.

### కొండా సురేఖపై తీవ్ర సిఫార్సులు

కొండా సురేఖ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది తొలిసారి కాదని క్రమశిక్షణ కమిటీ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా వ్యవహరించడంపై కమిటీ తీవ్రంగా

మిగతా 2లో

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు..

## విదేశీ విద్య ఎలా ఇస్తారు?:

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో కాలేజీలు మూతపడుతున్నాయని ఆరోపణ
- విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీలు ఇబ్బందులు పెడుతున్నాయని వ్యాఖ్య
- తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బండి సంజయ్



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే చెల్లించలేని పరిస్థితుల్లో ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలను తీసుకొచ్చి విదేశీ విద్య అందిస్తామంటూ ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఫీజు బకాయిలు అందక కాలేజీలు మూతపడుతున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆరోపించారు.

### ఫీజు బకాయిలతో కాలేజీలు మూత..


ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ అన్నారు.

మిగతా 2లో

# పరువు కోసం కన్న కూతురినే చంపించాడు..

## ప్రియుడితో హత్య చేయించిన తండ్రి

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారు డిక్కీలో మహిళ మృతదేహం
- మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానసగా గుర్తించిన పోలీసులు
- కుటుంబ పరువు పోతుందనే కారణంతో తండ్రి రాజేశం హత్యకు ఆదేశించినట్లు వెల్లడి
- తండ్రి ఆదేశాల మేరకు మానసను గొంతు నులిమి చంపిన ప్రియుడు వినోద్‌కుమార్
- నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు



2లో

# రేవంత్ అమెరికా టూర్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

- కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై కొనసాగుతున్న రాజకీయ దుమారం
- అనుమతి రాకముందే సీఎం టూర్ షెడ్యూల్ ఖరారు చేసుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శ
- స్పష్టమైన పరిపాలనా కారణాలతోనే విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించిందని వెల్లడి
- న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో సీఎం భేటీపై కిషన్‌రెడ్డి ప్రశ్నలు
- విదేశీ పర్యటనల విషయంలో సీఎంలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన

2లో

# హైదరాబాద్‌లో ఇక అర్ధరాత్రి దాటినా బస్సులు..

## 30 ప్రత్యేక సర్వీసులకు ఆర్టీసీ రెడీ



- నైట్‌షిఫ్ట్ ఉద్యోగులు, రాత్రి ప్రయాణికుల కోసం థర్డ్‌షిఫ్ట్ బస్సులు
- తొలి దశలో ఆరు ప్రధాన మార్గాల్లో 30 బస్సులు
- రాత్రి 10.30 నుంచి ఉదయం 5 గంటల వరకు సేవలు
- ప్రయాణికుల స్పందన, ఆక్యుపెన్సీ ఆధారంగా మరిన్ని మార్గాలకు విస్తరణ
- ఐటీ, బీపీవో, ఆసుపత్రులు, హోటళ్ల సిబ్బందికి భారీ ఊరట

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** హైదరాబాద్ నగర ప్రజలకు గ్రేటర్ ఆర్టీసీ తీపికబురు చెప్పేందుకు సిద్ధమవుతోంది. పెరుగుతున్న నైట్‌లైఫ్, నైట్ షిఫ్ట్ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్ధరాత్రి తర్వాత కూడా ప్రత్యేక బస్సు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా థర్డ్‌షిఫ్ట్ బస్సులను ప్రయోగాత్మకంగా నడపాలని అధికారులు యోచిస్తున్నారు.

### ఆరు ప్రధాన మార్గాల్లో 30 బస్సులు

తొలి దశలో నగరంలోని ఆరు రద్దీ ప్రధాన కారిడార్లను ఎంపిక చేశారు. ఒక్కో మార్గంలో కనీసం ఐదు బస్సుల చొప్పున మొత్తం 30 బస్సులను నడపాలని నిర్ణయించారు. రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి.మేడ్చల్–గచ్చిబౌలి (195), కొండాపూర్–సికింద్రాబాద్ (10H), కోఠి–పటాన్‌చెరు (218), కోఠి–పటాన్‌చెరు (222A), హయత్‌నగర్–జేబీఎస్ (290U), సికింద్రాబాద్–పటాన్‌చెరు (219) మార్గాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

### నైట్‌షిఫ్ట్ ఉద్యోగులకు ఊరట

ఈ మార్గాలు నగరంలోని కీలక ఐటీ హబ్‌లను వివిధ నివాస ప్రాంతాలతో అనుసంధానించనున్నాయి. దీంతో రాత్రి వేళ విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఐటీ, బీపీవో, ఇతర నైట్‌షిఫ్ట్ ఉద్యోగులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం అర్ధరాత్రి తర్వాత ప్రజా రవాణా పరిమితంగా ఉండటంతో ఉద్యోగులు క్యాబ్‌లు, ఆటోలు, వ్యక్తిగత వాహనాలపై ఆధారపడుతున్నారు. ప్రత్యేక బస్సులు అందుబాటులోకి వస్తే ప్రయాణ ఖర్చు తగ్గడంతో పాటు రాత్రివేళ ప్రజా రవాణా భద్రత కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

### రైల్వే, బస్‌స్టేషన్ ప్రయాణికులకూ ప్రయోజనం

తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకునే ప్రయాణికులకు కూడా ఈ సేవలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్‌కు రాత్రి లేదా తెల్లవారుజామున చేరుకునే వారికి నగరంలోని ప్రధాన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజా రవాణా అందుబాటులోకి రానుంది.

### ఆక్యుపెన్సీ ఆధారంగా విస్తరణ

నగరంలో ఐటీ సంస్థలు, ఆసుపత్రులు, హోటళ్లు, లాజిస్టిక్స్, ఇతర షిఫ్ట్ ఆధారిత రంగాలు విస్తరిస్తున్న నేపథ్యంలో 24 గంటల ప్రజా రవాణా అవసరం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో థర్డ్‌షిఫ్ట్ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రారంభించి ప్రయాణికుల స్పందన, ఆక్యుపెన్సీని అధికారులు పరిశీలించనున్నారు.ఆశించిన స్థాయిలో ప్రయాణికుల ఆదరణ లభిస్తే మరిన్ని ప్రధాన మార్గాలకు ఈ సేవలను విస్తరించే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

# సుమంత్ కేసులో కీలక పరిణామం

## జూబ్లీహిల్స్ సీఐపై సస్పెన్షన్ వేటు

- మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణామం
- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలతో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ సస్పెన్షన్
- ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలో అలసత్వంపై చర్యలు
- ఇప్పటికే నలుగురు అరెస్ట్.. సుమంత్ కోసం మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు
- టాస్క్‌ఫోర్స్ కూడా ప్రత్యేక బృందంతో సుమంత్ కోసం వేట

2లో



# యాప్‌లో అప్‌లోడ్ చేసిన 10 నిమిషాల్లోనే యూరియా స్టాక్ ఖాళీ

- రైతులకు తప్పని తిప్పలు.
- ఎరువుల యాప్ నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు
- యూరియా స్టాక్ వివరాలు అప్‌లోడ్ చేసిన నిమిషాల్లోనే ఖాళీ
- సిద్దిపేట డివిజన్‌లో 12 వేల మెట్రిక్ టన్నుల డిమాండ్.. సరఫరా 4,500 టన్నులే
- సర్వర్ డౌన్, ఓటీపీ ఆలస్యంతో బుకింగ్‌లో గందరగోళం
- ఈ-యాప్‌లో గ్రామాల పేర్లు కనిపించక రైతులకు మరింత ఇబ్బంది

**సిద్దిపేట, ప్రజావాయిస్ బ్యూరో :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ రైతులకు శాపంగా మారింది. యూరియా స్టాక్ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లోనే స్టాక్ పూర్తిగా అయిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు యాప్‌లో సర్వర్ డౌన్ కావడం, ఓటీపీలు సకాలంలో రాకపోవడం, స్టాక్ అయిపోయిన తర్వాత కూడా బుకింగ్ నమోదవుతుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.



**వరి సాగు తగ్గినా.. యూరియా డిమాండ్ తగ్గలేదు**

సిద్దిపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో గతేడాది 86 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఈ వానకాలం సీజన్‌లో 73 వేల ఎకరాలకు తగ్గింది. వరికి బదులుగా కంది, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటల సాగును అధికారులు ప్రోత్సహించారు.అయినప్పటికీ యూరియా డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఈ వానకాలం సీజన్‌కు సుమారు 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేసి నివేదికలు పంపారు. అయితే ఇప్పటి వరకు కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయినట్లు తెలుస్తోంది.

**10 నిమిషాల్లోనే స్టాక్ ఖాళీ..**

యూరియా స్టాక్ వివరాలను యాప్‌లో నమోదు చేసిన వెంటనే రైతులు బుకింగ్ చేసుకోవాల్సి వస్తోంది. అయితే స్టాక్ వివరాలు అప్‌లోడ్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లోనే పూర్తిగా అయిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.సర్వర్ డౌన్ కావడం, ఓటీపీలు ఆలస్యంగా రావడం వంటి సాంకేతిక సమస్యలతో సమయానికి బుకింగ్ చేసుకోలేకపోతున్నామని చెబుతున్నారు. స్టాక్ అందుబాటులో లేకపోయినా బుకింగ్ నమోదవుతుండటంతో మరింత గందరగోళం నెలకొంటోంది.

**రెండు గ్రామాల పేర్లు కనిపించక ఇబ్బందులు..**

నంగునూరు మండలంలోని వెంకటాపూర్ మురుదాబాద్, మైసంపల్లి గ్రామాల పేర్లు ఎరువుల యాప్‌లో కనిపించడం లేదు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ నుంచి ఈ గ్రామాల పేర్లు రాకపోవడంతో పాటు ఎల్‌జీ కోడ్స్ మ్యాప్ కాలేదని అధికారులు గుర్తించారు.ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని తెలుస్తోంది. దీంతో ఆ గ్రామాల రైతులు యాప్‌లో కనిపించే ఇతర గ్రామాలను ఆశ్రయించి ఎంతో కొంత యూరియా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**దౌల్తాబాద్‌లోనూ కొరత..**

దౌల్తాబాద్ మండలంలోనూ యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. సిద్దిపేట జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో సుమారు 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 3 లక్షలకు పైగా ఎకరాల్లో వరి, 75 వేల ఎకరాల్లో పత్తి, 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న, లక్ష ఎకరాల్లో మిర్చి, ఇతర కూరగాయ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.పంటలకు కీలకమైన సమయంలో యూరియా కోసం యాప్‌పై ఆధారపడాల్సి రావడం రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పెంచడంతో పాటు యాప్‌లోని సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# రేవంత్ అమెరికా టూర్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేంద్ర అనుమతి రాకముందే ముఖ్యమంత్రి హడావుడిగా అమెరికా టూర్ షెడ్యూల్ ఖరారు చేసుకున్నారని విమర్శించారు. విదేశాంగ శాఖ స్పష్టమైన పరిపాలనా కారణాలతోనే పర్యటనకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

**అనుమతి రాకముందే టూర్ ఖరారు**

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి విదేశీ పర్యటనల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గతంలో రేవంత్‌రెడ్డి అమెరికా, లండన్ సహా పలు దేశాల్లో పర్యటించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు.అయితే ఈసారి మాత్రం విదేశాంగ శాఖ స్పష్టమైన పరిపాలనా కారణాలను పరిగణనలోకి తీసుకుని అనుమతి ఇవ్వలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు.

**మమ్దానీతో భేటీపై ప్రశ్నలు**

రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఎవరెవరితో భేటీ కావాలని నిర్ణయించుకున్నారనే అంశాన్ని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో సీఎం భేటీ కావాల్సి ఉండటంపై ప్రశ్నలు సంధించారు.ప్రధాని నరేంద్ర మోదీని గతంలో ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తిగా మమ్దానీపై ఆరోపణలు ఉన్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత దేశానికి, ముఖ్యంగా ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మమ్దానీ గతంలో వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అలాంటి వ్యక్తితో ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేత సమావేశం కావడం సముచితమా అని ప్రశ్నించారు.

**గతంలో మోదీకి అనుమతి నిరాకరణ**

2005లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. గతంలో పలువురు ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు కూడా కేంద్రాలు అనుమతి నిరాకరించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు.ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లినప్పుడు ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాల వల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం ఉంటుంది? వంటి అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు.

**అధికారుల బృందాన్ని పంపొచ్చు**

పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అవసరమైతే అధికారుల బృందాన్ని విదేశాలకు పంపించి పెట్టుబడులను ఆకర్షించవచ్చని సూచించారు. సీఎం తన స్థాయికి తగిన వ్యక్తులు, సంస్థలతోనే చర్చలు జరపాలని అన్నారు.మరోవైపు అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో.. కిషన్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశాన్ని మరింత వేడెక్కించాయి.

# సుమంత్ కేసులో కీలక పరిణామం
## జూబ్లీహిల్స్ సీఐపై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఆలస్యం చేయడంతో పాటు.. కేసు నమోదైన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలోనూ అలసత్వం వహించారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

**మూడు వారాలకే సీఐపై వేటు**

ముత్తు యాదవ్ కేవలం మూడు వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే సస్పెన్షన్‌కు గురికావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సుమంత్ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి**

గత నెల 30న చెంగిచెర్లకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణను డబ్బు వ్యవహారంపై మాట్లాడేందుకు జూబ్లీహిల్స్‌లోని సుమంత్ కార్యాలయానికి పిలిపించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సుమంత్‌తో పాటు అతని అనుచరులు ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డి, రాము తదితరులు హరికృష్ణపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు ఫిర్యాదు నమోదైంది.తీవ్రంగా గాయపడిన హరికృష్ణ ఫిర్యాదు మేరకు చెంగిచెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. అనంతరం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి పరార్**

కేసు వెలుగులోకి రావడంతో సుమంత్ తన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన కోసం జూబ్లీహిల్స్ పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా మరో ప్రత్యేక బృందంతో సుమంత్ ఆచూకీ కోసం వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇప్పటికే నలుగురు అరెస్ట్**

ఈ కేసులో ఇప్పటికే నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సుమంత్ డ్రైవర్ నవీన్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుడిని అరెస్ట్ చేసే విషయంలో సీఐ ముత్తు యాదవ్ వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించిన అనంతరం సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# కొండా సురేఖకు షాక్?
## మంత్రి పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు

మొదటి పేజీ తరువాయి

పరిగణించినట్లు సమాచారం.చిన్నారెడ్డి వ్యవహారాన్ని కూడా కమిటీ పరిశీలించి.. ఆయనపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరిపై వేర్వేరుగా నివేదిక సిద్ధం చేసి టీపీసీసీ చీఫ్‌కు అందజేశారు.

**పార్టీ క్రమశిక్షణే కీలకం**

నివేదిక సమర్పించిన అనంతరం గాంధీ భవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీపై గౌరవం ఉంటేనే మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు.పార్టీపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడకుండా ఉండేందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందేనని తెలిపారు. కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించవద్దని.. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడకూడదని సూచించారు.

**హైకమాండ్ ఆదేశాల మేరకే చర్యలు**

తాము సిద్ధం చేసిన నివేదికను పార్టీ వ్యవహారంగా భావించి టీపీసీసీ అధ్యక్షుడికి అందజేశామని మల్లు రవి తెలిపారు. ఈ నివేదికను పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా పంపినట్లు చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి కూడా నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.హైకమాండ్ ఆదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని మల్లు రవి స్పష్టం చేశారు. నివేదికలోని అంశాలను బహిరంగంగా వెల్లడించలేనని, అలా చేస్తే తనకే నోటీసులు వచ్చే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు.

**రేవంత్‌రెడ్డితో భేటీ**

క్రమశిక్షణ కమిటీ నివేదిక నేపథ్యంలో మల్లు రవి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక అందించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌కు నివేదిక చేరడంతో ఇప్పుడు సీఎం, కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్న దానిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.కొండా సురేఖ, చిన్నారెడ్డిపై కమిటీ చేసిన సిఫార్సులను హైకమాండ్ ఆమోదిస్తుందా? లేక మరోసారి వివరణ కోరుతుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు..
## విదేశీ విద్య ఎలా ఇస్తారు?:

మొదటి పేజీ తరువాయి

కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అవమానిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ప్రశ్నించారు.ఫీజు బకాయిలు అడిగే కాలేజీ యాజమాన్యాలను బెదిరించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటని నిలదీశారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

**విదేశీ విద్యపై ప్రశ్నలు..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడానికే ప్రభుత్వం ఇబ్బందులు పడుతున్నప్పుడు విదేశీ విద్యను అందిస్తామని చెప్పడాన్ని ఎలా నమ్మాలని బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనిపించడం లేదా అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేయడమేనా అని ప్రశ్నించారు.

**రూ.15 వేల కోట్లు చెల్లించాలి..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్లను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.హామీలిచ్చి ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మించిపోతోందని విమర్శించారు.

**రాంచంద్రరావు దీక్షకు మద్దతు..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు చేపట్టిన ‘ఫీజు బకాయి–బీజేపీ లడాయి’ దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఆయన దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారని తెలిపారు.రాంచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచే వరకు పోరాటం కొనసాగిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో చోటుచేసుకునే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# అర్వింద్‌పై నిఘా ఆరోపణలు అవాస్తవం
## స్పష్టం చేసిన డీజీపీ సీవీ ఆనంద్

- తనపై పోలీసులు నిఘా పెట్టారని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపణలు
- సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాలతో ఏసీపీ స్థాయి అధికారి తనను అనుసరిస్తున్నారని వ్యాఖ్యలు
- అర్వింద్ ఆరోపణలను ఖండించిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- ఎంపీపై నిఘా పెట్టేందుకు ఏ అధికారినీ నియమించలేదని స్పష్టీకరణ
- ఆధారాలు ఉంటే నేరుగా అందించాలని.. సమగ్ర దర్యాప్తు చేస్తామని హామీ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన నిఘా ఆరోపణలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పందించారు. తనపై పోలీసులు నిఘా పెట్టారని, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు ఏసీపీ స్థాయి అధికారి తన కదలికలను పర్యవేక్షిస్తున్నారని అర్వింద్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను డీజీపీ పూర్తిగా ఖండించారు.

**సీఎం సోదరుడి ఆదేశాలంటూ అర్వింద్ ఆరోపణలు**

అర్వింద్ ఎక్స్ వేదికగా డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆరోపణలు చేశారు. సీఎం సోదరుడి ఆదేశాల మేరకు తనపై నిఘా పెట్టినట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఏసీపీ స్థాయి అధికారికి తన కదలికలను పర్యవేక్షించే బాధ్యత అప్పగించినట్లు ఆరోపించారు.తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార యంత్రాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని అర్వింద్ వ్యాఖ్యానించారు. ఏ రాజకీయ కుటుంబం ఆదేశాల మేరకు పోలీసులు పనిచేయడం సరికాదని ప్రశ్నించారు.

**ఆరోపణలను తోసిపుచ్చిన డీజీపీ**

అర్వింద్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఎంపీని అనుసరించడానికి లేదా ఆయనపై నిఘా ఉంచడానికి ఏ అధికారినీ నియమించలేదని వెల్లడించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా విచారించి వాస్తవాలను నిర్ధారించుకున్నామని తెలిపారు.తెలంగాణ పోలీస్ శాఖ ఇలాంటి నిఘా పద్ధతులను అనుసరించదని డీజీపీ పేర్కొన్నారు. పోలీసులు రాజ్యాంగం, చట్టానికి లోబడి మాత్రమే విధులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

**ఆధారాలు ఇస్తే దర్యాప్తు**

తనపై నిఘా పెట్టినట్లు ఎంపీ అర్వింద్ వద్ద ఏవైనా ఆధారాలు లేదా కచ్చితమైన సమాచారం ఉంటే నేరుగా తనకు అందించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. వాటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి వాస్తవాలను తేలుస్తామని హామీ ఇచ్చారు.

**అర్వింద్ తదుపరి స్పందనపై ఆసక్తి**

ఎంపీ అర్వింద్ చేసిన ఆరోపణలను డీజీపీ ఖండించడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఒకవైపు తన కదలికలపై నిఘా పెట్టారని అర్వింద్ ఆరోపిస్తుండగా.. మరోవైపు అలాంటి ఆదేశాలు ఏవీ ఇవ్వలేదని డీజీపీ స్పష్టం చేశారు. దీంతో డీజీపీ వివరణపై ఎంపీ అర్వింద్ ఎలా స్పందిస్తారనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పరువు కోసం కన్న కూతురినే చంపించాడు..
## ప్రియుడితో హత్య చేయించిన తండ్రి

**హనుమకొండ, ప్రజావాయిస్ బ్యూరో :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారు డిక్కీలో మహిళ మృతదేహం లభించిన కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ పరువు పోతుందనే కారణంతో కన్న కూతురిని ఆమె ప్రియుడితోనే తండ్రి హత్య చేయించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మృతురాలిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. ఈ కేసులో ఎల్కతుర్తికి చెందిన వినోద్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**రెండు వివాహాలు.. ఇద్దరు భర్తలతో విడాకులు**

మానసకు గతంలో రెండు వివాహాలు జరగ్గా.. ఇద్దరు భర్తలతోనూ విడాకులు అయ్యాయని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో కరీంనగర్‌కు చెందిన వినోద్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి ఇద్దరూ సన్నిహితంగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.ఇటీవల అరుణాచలం వెళ్తున్నానని చెప్పి మానస వినోద్ వద్దకు వెళ్లింది. తనను వివాహం చేసుకోవాలని అతడిపై ఒత్తిడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

**తండ్రికి ఫోన్ చేసిన ప్రియుడు**

మానస పెళ్లి విషయాన్ని వినోద్‌కుమార్ ఆమె తండ్రి రాజేశంకు ఫోన్ చేసి చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. కుమార్తె తమ మాట వినకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తోందని, కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని రాజేశం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు.తన కుమార్తె వల్ల కుటుంబ పరువు పోతోందని భావించిన రాజేశం.. మానసను హత్య చేయాలని వినోద్‌కుమార్‌ను కోరినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఆదేశాల మేరకు వినోద్ మానసను గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు వెల్లడించారు.

**కారు డిక్కీలో మృతదేహం**

హత్య అనంతరం మానస మృతదేహాన్ని వినోద్ కారులోని డిక్కీలో ఉంచి ఎల్కతుర్తిలోని తన ఇంటి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లాడు. అక్కడ మృతదేహాన్ని పాతిపెట్టేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.అయితే పరిసరాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు.

**వినోద్ అరెస్ట్.. తండ్రి పాత్రపై దర్యాప్తు**

అనుమానితుల కదలికలపై ఆరా తీసిన పోలీసులు చివరకు ఎల్కతుర్తి శివారులో వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో మానస తండ్రి రాజేశం పాత్రపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కుటుంబ పరువు పేరుతో కన్న కూతురినే హత్య చేయించినట్లు ఆరోపణలు రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.


# బెట్టింగ్ యాప్‌లకు బానిసై
## చోరీలు చేసిన జాతీయ ఫుట్‌బాలర్ అరెస్ట్

- బెట్టింగ్‌లో భారీగా డబ్బులు పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోయిన యువకుడు
- అప్పులు తీర్చేందుకు వరంగల్‌లో వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసుల గుర్తింపు
- నిందితుడు పెద్దపల్లికి చెందిన ఆశీష్ శ్రీనివాస్‌రెడ్డి
- అతడి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారం, 527.9 గ్రాముల వెండి స్వాధీనం
- రూ.29,875 నగదు కూడా రికవరీ చేసిన వరంగల్ పోలీసులు

**వరంగల్, ప్రజావాయిస్ బ్యూరో :** బెట్టింగ్ యాప్‌లకు బానిసై భారీగా అప్పులు చేసిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు.. వాటిని తీర్చేందుకు వరుస చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆశీష్ శ్రీనివాస్‌రెడ్డి మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఎంటెక్ చదువుతున్నాడు. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి అప్పులపాలైన అతడు వరంగల్‌కు వచ్చి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

**బెట్టింగ్‌తో భారీగా అప్పులు**

జాతీయస్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన ఆశీష్ కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడ్డాడు. తొలుత సొంత డబ్బుతో బెట్టింగ్ చేసిన అతడు.. ఆ తర్వాత అప్పులు చేసి మరీ భారీ మొత్తాల్లో బెట్టింగ్‌లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.బెట్టింగ్‌లో వరుసగా నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చేందుకు మార్గం లేక వరంగల్‌కు వచ్చిన ఆశీష్ చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.



**తాళం వేసిన ఇళ్లే టార్గెట్**

మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ఆర్ తోట, శివనగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను నిందితుడు లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించినట్లు తెలిపారు.చోరీలపై బాధితుల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించి నిందితుడి కదలికలను గుర్తించారు.

**రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్**

పోలీసులు చివరకు వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆశీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి వస్తువులు, రూ.29,875 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత తెలిపారు.నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి**

ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై అప్పులు చేయడం, నష్టాలను పూడ్చుకునేందుకు మరింత అప్పుల్లో కూరుకుపోవడం చివరకు నేరాలకు దారితీస్తోందని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# కుండపోతకు కూలిన ఇల్లు

- వర్షాల బీభత్సానికి గోమాస లక్ష్మయ్య కుటుంబం రోడ్డుపాలు
- రెండు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలు
- ఒక్కసారిగా కూలిన నివాస గృహం- ధాన్యం, గృహోపకరణాలు, దుస్తులు ధ్వంసం
- నిలువ నీడ లేక తీవ్ర అవస్థలు
- ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

**ప్రజా వాయిస్,పలిమెల:** జయశంకర్ భూపాల పల్లి జిల్లా మంథని నియోజకవర్గం పలిమెల మండల కేంద్రంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాల ధాటికి పలిమెల గ్రామానికి చెందిన గోమాస లక్ష్మయ్య నివాస గృహం మంగళవారం పూర్తిగా కూలిపోయి నేలమట్టమైంది. ఇల్లు ఒక్కసారిగా కూలిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యం, గృహోపకరణాలు, దుస్తులు సహా పలు వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయని బాధితులు తెలిపారు. ఇంటిని కోల్పోవడంతో ప్రస్తుతం ఉండేందుకు నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పిల్లలు, కుటుంబ సభ్యులతో ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు.విషయం తెలుసుకున్న అధికారులు, రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించాలని బాధిత కుటుంబం కోరింది. కూలిన ఇంటితో పాటు ధ్వంసమైన సామగ్రి, ధాన్యానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేసింది. వర్షాలు తగ్గే వరకు తాత్కాలికంగా తలదాచుకునేందుకు వసతి కల్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది.

# ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో సమానత్వం ఎక్కడ..?

- ఒకే గ్రామంలో..ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయమా..?
- 11 ఇంక్లైన్ ప్రాజెక్ట్‌లో ఇల్లు, భూములు కోల్పోయిన కుటుంబం
- 2008 కట్ఆఫ్ నిబంధనపై అధికారుల తీరుపై బాధితుడి ఆవేదన
- తనకంటే తక్కువ వయసున్న వారికి ప్యాకేజీ.. తనకు నిరాకరణ
- మంథని ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- అర్హతను పునఃపరిశీలించి పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వినతి




**ప్రజా వాయిస్, మంథని:** సింగరేణి బొగ్గు విస్తరణ ప్రాజెక్టు కోసం ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుడికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే గ్రామం, ఒకే ప్రాజెక్టు పరిధిలో ఉన్న బాధితులకు నిబంధనలను ఒక్కో విధంగా వర్తింపజేస్తున్నారని మాలం శంకర్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాలం శంకర్‌కుమార్ (తండ్రి రాములు, ఇంటి నంబర్ 2-46) కుటుంబానికి చెందిన ఇల్లు, భూములు 11 ఇంక్లైన్ బొగ్గు విస్తరణ ప్రాజెక్టు (ప్రాజెక్టు నంబర్ 392)లో భూసేకరణకు గురయ్యాయి. 2008 కట్ఆఫ్ తేదీ నాటికి తాను ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హుడినని ఆయన చెబుతున్నారు.

**ఒకే గ్రామంలో..వేర్వేరు నిబంధనలా.?**

సింగరెడ్డిపల్లి గ్రామంలో 2008 కట్ఆఫ్ తేదీ నాటికి తనకంటే రెండు, మూడు సంవత్సరాలు తక్కువ వయసున్న కొందరికి సైతం పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేశారని శంకర్‌కుమార్ పేర్కొంటున్నారు. అయితే అన్ని అర్హతలు ఉన్న తనకు మాత్రం ప్యాకేజీ నిరాకరించడంపై అధికారుల వైఖరిని ప్రశ్నిస్తున్నారు.

**ఆర్డీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు**

తనకు జరిగిన అన్యాయంపై మంథని ఆర్డీవో కార్యాలయంలో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని బాధితుడు వాపోతున్నారు. ఒకే ప్రాజెక్టు, ఒకే గ్రామానికి చెందిన నిర్వాసితుల విషయంలో భిన్నమైన ప్రమాణాలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నిస్తున్నారు.రాజ్యాంగం కల్పించిన సమానత్వ సూత్రం ప్రకారం తనకు కూడా న్యాయం చేయాలని శంకర్‌కుమార్ కోరుతున్నారు. గ్రామంలో ఇప్పటికే ప్యాకేజీ పొందిన బాధితుల కేసులతో తన కేసును పోల్చి సమగ్రంగా విచారణ జరపాలని, అర్హత ఉంటే పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయడంతోపాటు నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.



# ప్రజా సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

- పాపన్నపేట మండల వ్యాప్తంగా విమర్శల జోరు

**ప్రజా వాయిస్, పాపన్నపేట** పాపన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పేరుకుపోతున్న ప్రాథమిక సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రధాన సమస్యలు & క్షేత్రస్థాయి పరిస్థితులుగుంతలమయంగా మారిన రహదారులు: మండలంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గోతుల వల్ల వాహనదారులు, బాటసారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.తాగునీటి ఇబ్బందులు & మౌలిక వసతుల లేమి: కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తుండటంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.ధాన్యం కొనుగోలు ఆలస్యం: వర్షాకాలం మరియు కొనుగోలు సీజన్లలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రోడ్లపైనే రోజులు తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సరైన నిల్వ వసతులు లేక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నామని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వ భవనాలు & బస్టాండ్ల దుస్థితి: మండలంలోని పలు గ్రామీణ బస్టాండ్లు, పాఠశాలల భవనాలు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి."పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి పాపన్నపేట మండలంలోని సమస్యలను పరిష్కరించాలి."—స్థానిక ప్రజలు & ప్రజాసంఘాల నాయకులుపాపన్నపేట మండల వ్యాప్తంగా ఈ సమస్యలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది

# ఆస్తుల సవాల్.. రేగా గర్జన

- దమ్ముంటే అంబేద్కర్ సెంటర్‌కు రావాలి
- పాయం వెంకటేశ్వర్లకు మాజీ ఎమ్మెల్యే రేగా బహిరంగ సవాల్
- అక్రమ ఆస్తులు ఉన్నట్లు నిరూపిస్తే ప్రజలకు పంచేందుకు సిద్ధం
- చిత్తశుద్ధి ఉంటే పాయం కూడా తన ఆస్తులపై స్పష్టత ఇవ్వాలి
- మాట తప్పకుండా ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్న రేగా
- సవాల్‌పై పాయం మౌనం.. రాజకీయ వర్గాల్లో చర్చ
- రేగా దూకుడుతో వలస కాంగ్రెస్ వర్గాల్లో గుబులు




ప్రజా వాయిస్,భద్రాద్రి కొత్తగూడెం: పినపాక నియోజకవర్గంలో రాజకీయ వర్గపోరు మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల మధ్య మాటల యుద్ధం తీవ్రతరమవుతోంది. తనపై అక్రమ ఆస్తుల ఆరోపణలు చేస్తున్న పాయం దమ్ముంటే మణుగూరు అంబేద్కర్ సెంటర్‌కు వచ్చి చర్చించాలని రేగా సవాల్ విసిరారు. తనకు అక్రమ ఆస్తులు ఉన్నట్లు నిరూపిస్తే వాటిని ప్రజలకు పంచేందుకు సిద్ధమని ప్రకటించారు.సోమవారం మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో రేగా చేసిన సవాల్‌కు కొనసాగింపుగా మంగళవారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని మీడియా ఎదుట తన వాదన వినిపించారు. తాను ఇచ్చిన మాట ప్రకారం అక్కడికి వచ్చానని, ఇప్పుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా తన సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని డిమాండ్ చేశారు.తనపై రాజకీయంగా ఎదుర్కోలేకే అక్రమ ఆస్తుల పేరుతో ఆరోపణలు చేస్తున్నారని రేగా మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు రేగా వరుసగా సవాళ్లు విసురుతున్నా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అంబేద్కర్ సెంటర్‌కు రావాలని బహిరంగంగా పిలుపునిచ్చినా పాయం మౌనం వహించడంపై ప్రతిపక్ష శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నాయి. పాయం స్పందిస్తారా? లేక మౌనం కొనసాగిస్తారా? అన్నది పినపాక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.అయితే నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ కార్యకర్తలు, కొత్తగా పార్టీలో చేరిన నేతల మధ్య విభేదాలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పాలన, అభివృద్ధి, ఇసుక క్వారీల వ్యవహారాలపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు ఈ రాజకీయ వేడిని మరింత పెంచుతున్నాయి. రేగా దూకుడుగా రంగంలోకి దిగడంతో పినపాక కాంగ్రెస్‌లోని వర్గపోరు ప్రతిపక్షానికి అస్త్రంగా మారిందన్న చర్చ సాగుతోంది.

# పచ్చదనంపై గొడ్డలి వేటు

- జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఘటన
- ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లకు కత్తెర
- నరికివేతపై అధికారుల అనుమతులపై స్పష్టత కరవు
- నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా?
- పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు

**ప్రజా వాయిస్,జహీరాబాద్:** ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో పచ్చదనంపై గొడ్డలి వేటు పడింది. ఆస్పత్రిలోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లను ఇటీవల నరికివేశారు. అయితే నరికిన చెట్ల కాండాలను అక్కడే వదిలేయడం చర్చనీయాంశంగా మారింది. చెట్ల తొలగింపునకు ముందస్తు అనుమతులు తీసుకున్నారా? లేదా? అన్నది స్పష్టంగా తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాల్సి వచ్చినా నిబంధనల ప్రకారం సంబంధిత అటవీ, రెవెన్యూ లేదా మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆస్పత్రి ప్రాంగణంలో చెట్ల నరికివేతకు సంబంధించి అలాంటి అనుమతులు పొందినట్లు స్పష్టమైన సమాచారం లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలోనే చెట్లను నరికివేయడంపై అధికారులు స్పందించి, అనుమతుల వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.





# సాగర్ నీళ్లపై సమరం.. సర్కారుపై బీఆర్ఎస్ గరం

- నల్లగొండ ఆయకట్టుకు నీళ్లివ్వకుండా.. ఏపీకి తరలిస్తారా.?
- మంత్రి ఉత్తమ్ రాజీనామా చేయాలి: బొల్లం డిమాండ్
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపుపై సర్కారు మౌనం ఎందుకు.?
- సాగర్‌లో నీళ్లున్నా.. ఆయకట్టుకు విడుదల చేయరా.?
- రైతుల పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా.?
- నీళ్లు విడుదల చేయకుంటే ఉద్యమం ఉధృతం

**ప్రజా వాయిస్,కోదాడ:** నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు, ప్రజలకు తాగునీరు విడుదల చేయాలని కోదాడ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వైఫల్యం వల్లే నల్లగొండ జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోదాడ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.సాగర్‌లో నీళ్లున్నప్పటికీ ఆయకట్టుకు విడుదల చేయకుండా ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారని మల్లయ్య యాదవ్ ఆరోపించారు. మరోవైపు పోతిరెడ్డిపాడు నుంచి ఏపీకి నీటిని తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని విమర్శించారు. సాగర్, శ్రీశైలం జలాశయాల్లో తెలంగాణకు ఉన్న నీటి హక్కులను కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం జరుగుతోందన్నారు.వర్షాభావ పరిస్థితులతో బోర్లు, బావులు ఎండిపోయి పంట పొలాలు నెర్రలు బారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డెడ్ స్టోరేజీలోనూ రైతులకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. సాగర్ నీటిని తక్షణమే విడుదల చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మల్లయ్య యాదవ్ హెచ్చరించారు

# శంకరంపేట గ్రామపంచాయతీలో విచారణ

- విచారణ వివరాల ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిక
- జలసిరి, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అధికారుల సమీక్ష

**పెద్ద శంకరంపేట, ప్రజా వాయిస్:**శంకరంపేట–ఎ గ్రామపంచాయతీలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా విచారణ నిర్వహించారు. గ్రామపంచాయతీలో వివిధ అంశాలపై వివరాలను సేకరించిన అధికారులు, విచారణలో లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.అనంతరం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, జలసిరి పనులు, గ్రామపంచాయతీ సామాజిక కార్యాచరణ ప్రణాళిక అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికల పురోగతి, జలసిరి కింద చేపట్టిన పనుల ప్రారంభం, పురోగతి, సామాజిక కార్యాచరణ ప్రణాళిక పనుల ప్రణాళిక, అమలు తదితర అంశాలను అధికారులు సమీక్షించారు.పెండింగ్ పనులు వేగవంతం చేయాలి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి క్రాంతికుమార్, మండల పంచాయతీ అధికారి జాకీర్ హుస్సేన్, సహాయ కార్యక్రమ అధికారి సంతోష్‌కుమార్, ఈసీ నవాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.





# బాపూజీ చేతిలో కర్ర మాయం

- గ్రంథాలయ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పట్టని దుస్థితి
- చేయి విరిగినా.. కర్ర మాయమైనా పట్టించుకోని అధికారులు
- ఏడాదిగా ఇదే పరిస్థితి.. పట్టించుకునే నాథుడే కరువు
- బాపూజీ విగ్రహానికి దక్కని కనీస గౌరవం
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- మరమ్మతులు చేసి పూర్వ వైభవం తేవాలని డిమాండ్

**జా వాయిస్,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని బాపూజీ గ్రంథాలయ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహం దుస్థితికి చేరింది. సత్యం, అహింసకు ప్రతీకగా నిలిచిన బాపూజీ విగ్రహం చేతిలోని కర్ర మాయమవడంతోపాటు ఓ చేయి విరిగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారుల దృష్టికి రాకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జ్ఞానాన్ని పంచే గ్రంథాలయ ప్రాంగణంలోనే దేశానికి దిశానిర్దేశం చేసిన మహాత్ముడి విగ్రహం నిరాదరణకు గురికావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగిన చేయికి మరమ్మతులు చేయడంతోపాటు చేతికర్రను అమర్చి గాంధీ విగ్రహానికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# తంప్లూర్ రోడ్డుతో ప్రజల అవస్థలు

- దారిపొడవునా గుంతలే
- ప్రయాణం సాగేదెలా..?



**ప్రజా వాయిస్ టేక్మాల్ :** టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దారిపొడవునా ఏర్పడిన గుంతలు, రోడ్డుపై కనిపిస్తున్న గుంతలతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్న పరిస్థితి నెలకొంది.ఏళ్లుగా ఈ రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ ప్రయాణించాల్సి రావడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజల అవస్థలు తీరడం లేదు**

ప్రభుత్వాలు మారుతున్నా తంప్లూర్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



# అమిత్ షా రాజీనామాకు యూత్ కాంగ్రెస్ డిమాండ్

- విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్, పెల్లెట్ దాడులకు నిరసన
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆందోళనలు
- పరీక్షా పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్

**ప్రజా వాయిస్,భద్రాద్రి కొత్తగూడెం:** ఢిల్లీలో పరీక్షా పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో అక్రమాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, పెల్లెట్ తుపాకులతో దాడి చేశారంటూ యూత్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే వారిపై పోలీసుల బలప్రయోగం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. పరీక్షా పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని చీకటి కార్తీక్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే నిరసనలను అణచివేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన చేపట్టడంతో రైల్వే స్టేషన్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.జిల్లాలోని పలు మండలాల్లోనూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.



# బురద రోడ్డుపై వరినాట్లు..!

- గిరవెల్లి,గెర్రె రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ నిరసన
- మూడేళ్లుగా సాగని రహదారి నిర్మాణం
- అటవీ శాఖ అనుమతులు రాలేదంటూ పనులు నిలిపివేత
- అధికారంలోకి వస్తే అనుమతులు తెచ్చి రోడ్డు వేస్తామన్న హామీ ఏమైంది?
- బురదమయమైన మార్గంలో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్

**ప్రజా వాయిస్, దహెగాం:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని గిరవెల్లి,గెర్రె గ్రామాల మధ్య రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. బురదమయంగా మారిన రోడ్డుపైనే వరినాట్లు వేసి ప్రభుత్వ వైఖరిని నిరసించారు. రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రహదారి నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాల్వాయి హరీష్‌బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంతో మాట్లాడి అనుమతులు తీసుకొచ్చి రహదారి నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా రహదారి నిర్మాణానికి అతీగతీ లేకపోవడంపై వారు మండిపడ్డారు. గతంలో బురద కనిపించిన చోటల్లా వరినాట్లు వేసి నిరసన తెలిపిన హరీష్‌బాబు.. ఇప్పుడు అధికారంలో ఉండి అదే సమస్యపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి గిరవెల్లి–గెర్రె రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.






# వనమహోత్సవం విజయవంతం

**మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**మండల ప్రత్యేక అధికారి శ్రీలత**

**జూలూరుపాడు, ప్రజా వాయిస్ :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాపకొల్లు, కొత్తూరు, జూలూరుపాడు, గ్రామ పంచాయతీల పరిధిలోని ఏవీన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటే కార్యక్రమానికి మండల పరిషత్ ప్రత్యేక అధికారి శ్రీ లత హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కలను క్రమం తప్పకుండా పరిరక్షించి వాటిని వృక్షాలుగా పెంచాలని ఆమె సూచించారు. అదేవిధంగా అన్ని గ్రామపంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, హెల్త్ సెంటర్ లు, గ్రామపంచాయతీల పరిసరాలలో సర్పంచ్ లు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, ఏపీఓ రామారావు, టిఏ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# పత్తిపాకలో పందుల స్వైరవిహారం

- ఇళ్లలోకి చొరబడి విధ్వంసం.. గ్రామస్థులకు తప్పని తిప్పలు
- పందుల బెడదపై పంచాయతీకి ఫిర్యాదులు
- వచ్చే నెల 5లోగా తొలగించాలని ఆదేశం
- గడువు దాటితే రూ.50 వేల జరిమానా.. చర్యలు తప్పవని హెచ్చరిక

**ప్రజా వాయిస్,హనుమకొండ:** హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో పందుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేస్తుండటంతోపాటు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పందుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ సమస్యను గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు పందుల పెంపకందారులు అంబాల సురేందర్, అంబాల వేణులను పిలిపించి పందులను గ్రామం నుంచి తరలించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అయితే పందులను గ్రామం నుంచి పూర్తిగా తొలగించేందుకు వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఇవ్వాలని వారు కోరినట్లు తెలిసింది.

**గడువు దాటితే చర్యలు**

నిర్ణీత గడువులోగా పందులను గ్రామం నుంచి తరలించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ పాలకవర్గం హెచ్చరించింది. అంతేకాకుండా రూ.50 వేల జరిమానా విధించడంతోపాటు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటించే చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. పందుల బెడద నుంచి తమకు విముక్తి కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రోడ్డు కొట్టుకుపాయే.. ప్రయాణం నరకమాయే

- వర్షాలకు ధ్వంసమైన ప్రధాన రహదారి
- భారీ గుంతలతో అవస్థలు
- రాత్రివేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాల ముప్పు
- తక్షణ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వెంకమ్‌బావి తండా దాటి ఎనగంటి తండా, సరళ మైసమ్మ వైపు వెళ్లే ప్రధాన రహదారి వర్షాల ధాటికి దారుణంగా దెబ్బతింది. భారీగా వరద నీరు ప్రవహించడంతో రోడ్డు పక్క భాగం కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రివేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్ల డ్రైవర్లు సైతం అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



# విద్యార్థిపై కర్కశత్వం.. ఆర్యభట్ట స్కూల్‌పై కేసు

- వార్డెన్, యాజమాన్యంపై పోలీసుల చర్యలు
- తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హిమాంశు
- ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు

**ప్రజా వాయిస్,తొర్రూరు:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని ఆర్యభట్ట స్కూల్‌లో విద్యార్థి పట్ల కర్కశంగా వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి హిమాంశు తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాల వార్డెన్, యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.విద్యార్థి పట్ల పాఠశాల సిబ్బంది, యాజమాన్యం వ్యవహరించిన తీరుపై తన ఫిర్యాదులో పలు అంశాలను పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆరోపణల ఆధారంగా కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

**ఆసుపత్రిలో చికిత్స**

ఘటన అనంతరం విద్యార్థి హిమాంశు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల పర్యవేక్షణలో అతడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను పోలీసులు తెలుసుకుంటున్నారు.

**అన్ని కోణాల్లో విచారణ**

విద్యార్థిపై ఎలాంటి పరిస్థితుల్లో కర్కశత్వం ప్రదర్శించారు. ఘటనకు అసలు కారణం ఏమిటి అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన సమయంలో అక్కడ ఉన్న వ్యక్తులు, పాఠశాల సిబ్బంది తదితరుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైన ఆధారాలు, వాంగ్మూలాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులోని ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉందని, ఆధారాల ఆధారంగా బాధ్యులపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.





## వన మహోత్సవం.. మొక్కల సంరక్షణే లక్ష్యం

- నాటిన ప్రతి మొక్కను కాపాడాలి..
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

**ప్రజా వాయిస్, వరంగల్/ వర్ధన్నపేట:** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.చెట్ల పెంపకంతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. వన మహోత్సవాన్ని కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.వనం అంటే అడవి, మహోత్సవం అంటే గొప్ప ఉత్సవమని.. చెట్లు, అడవులు, పచ్చదనాన్ని పెంపొందించడమే వన మహోత్సవం ఉద్దేశమన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, వార్డు కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, నాయకులు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, నేతావత్ రాజేందర్, ఎం.డి. అప్సర్, తిరుపెల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సదరం క్యాంపులో గందరగోళం.. కనిపించని కనీస సౌకర్యాలు!

- నడవలేని దివ్యాంగులకు వీల్ చైర్లు కూడా లేవు!?
- 500 మంది వస్తారనుకుంటే 3 వేల మంది తరలివచ్చారు
- మంచినీటి కౌంటర్ కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం
- ప్రణాళిక లేకుండా క్యాంపు నిర్వహించారంటూ అధికారులపై విమర్శలు
- నిర్వహణ తీరు మార్చాలి: కే. మల్లేశం, కె. యశోద డిమాండ్

**ప్రజా వాయిస్, మెదక్** దివ్యాంగులకు ఉపయోగపడాల్సిన సదరం క్యాంపు అధికారుల ముందస్తు ప్రణాళిక లోపంతో గందరగోళంగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు కె. యశోద ఆరోపించారు. మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సదరం క్యాంపులో వారు పాల్గొని అక్కడి పరిస్థితులను పరిశీలించారు.జిల్లా అధికారుల ఆదేశాలతో ఏర్పాటు చేసిన క్యాంపునకు పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తరలివచ్చారని తెలిపారు. సుమారు 500 మంది వస్తారని అంచనా వేయగా, దాదాపు 3 వేల మంది రావడంతో క్యాంపు వద్ద తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. దివ్యాంగులకు సమాచారం అందించడంలో స్పష్టత లేకపోవడం, ముందస్తుగా సరైన ప్రణాళిక రూపొందించకపోవడమే ఇందుకు కారణమని విమర్శించారు.నడవలేని వారికి వీల్‌చైర్ ఏది?క్యాంపునకు వచ్చిన వారిలో నడవలేని దివ్యాంగులు కూడా ఉన్నప్పటికీ వారికి అవసరమైన వీల్‌చైర్ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని మల్లేశం, యశోద అన్నారు. దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలోనే వారి ప్రాథమిక అవసరాలను పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు.క్యాంపు వద్ద కనీసం మంచినీటి కౌంటర్ కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. గంటల తరబడి వేచి ఉండాల్సిన దివ్యాంగులు, వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.సమాచారం స్పష్టంగా ఇవ్వకపోవడంతోనే..యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ సమాచారం ఇవ్వడంతో జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని నాయకులు పేర్కొన్నారు. అయితే ఎవరెప్పుడు రావాలి, ఏ విభాగానికి చెందిన వారికి ఏ సమయంలో పరీక్షలు నిర్వహిస్తారు, అవసరమైన పత్రాలు ఏమిటి వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు."దివ్యాంగులను ఒకేసారి వేల సంఖ్యలో పిలిచి, కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకపోవడం సరికాదు. ఇకపై సదరం క్యాంపులను పక్కా ప్రణాళికతో నిర్వహించాలి. వీల్‌చైర్లు, తాగునీరు, కూర్చునేందుకు సదుపాయం, ప్రత్యేక సహాయక సిబ్బందిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి" అని వారు డిమాండ్ చేశారు.జిల్లా అధికారులు ఈ క్యాంపు నిర్వహణలో ఎదురైన లోపాలను సమీక్షించి, భవిష్యత్తులో దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో శాంతిషా, లక్షి , ఎగొండ దాసు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరువు కోసం.. కూతురినే చంపించాడు

- కారులో మహిళ మృతదేహం కేసులో బిగ్ ట్విస్ట్
- ప్రియుడితో కలిసి కుమార్తె హత్యకు తండ్రి స్కెచ్
- తండ్రి చెప్పడంతోనే గొంతు నులిమి చంపిన ప్రియుడు
- పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతోనే దారుణం



**ప్రజా వాయిస్,హన్మకొండ జిల్లా :** ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యమైన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోదావరిఖనికి చెందిన మానసను ఆమె ప్రియుడు వినోద్‌కుమార్ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ హత్య వెనుక మానస తండ్రి రాజేశం ఉన్నట్లు విచారణలో తేలినట్టు సమాచారం.మానసకు గతంలో రెండుసార్లు వివాహం జరిగి విడాకులు తీసుకుంది. అనంతరం వినోద్‌కుమార్‌తో ప్రేమలో పడింది. తనను పెళ్లి చేసుకోవాలని మానస ఒత్తిడి చేస్తోందని వినోద్ ఆమె తండ్రి రాజేశంకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో కుటుంబ పరువు పోతుందనే ఉద్దేశంతో కూతురిని చంపేయాలని రాజేశం చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఆదేశాల మేరకే మానసను గొంతు నులిమి హత్య చేసినట్లు వినోద్ విచారణలో అంగీకరించినట్టు సమాచారం.

# ఫిర్యాదు నడుస్తుండగానే.. ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పులు

- పాత అసెస్మెంట్ నంబర్ 614 మాయం.. కొత్తగా 843 ప్రత్యక్షం
- 98 గజాల స్థలం 753 గజాలుగా మార్చిన వైనం
- అధికారుల ప్రమేయం లేకుండానే రికార్డులు ఎలా మారాయి.?
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాత మళ్లీ పాత విస్తీర్ణమే నమోదు
- చిలుకూరు మండలంలో ఈ-పంచాయతీ రికార్డుల మార్పులపై అనుమానాలు




**ప్రజా వాయిస్,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కొండాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఈ–పంచాయతీ రికార్డుల్లో చోటుచేసుకున్న వరుస మార్పులు చర్చనీయాంశంగా మారాయి. బెల్లే నాగయ్యకు సంబంధించిన హౌస్ అసెస్మెంట్ నంబర్ 614 కింద పాత రికార్డుల ప్రకారం 98 గజాలుగా ఉన్న స్థల విస్తీర్ణం.. జూలై 11న ఆన్‌లైన్ రికార్డుల్లో ఏకంగా 753 గజాలుగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మార్పు తన ప్రమేయం లేకుండానే జరిగిందని పంచాయతీ కార్యదర్శి గుర్తించినట్లు సమాచారం.సదరు స్థల యజమాని యాజమాన్య ధ్రువీకరణ పత్రం కోసం జూలై 15న గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న సమయంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పంచాయతీ రికార్డులు, ఆన్‌లైన్ వివరాల్లో తేడాలు ఉండటంతో కార్యదర్శి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

### ఫిర్యాదు తర్వాత మళ్లీ మార్పు

ఈ నెల 7న పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేయడంతో సంబంధిత వ్యక్తులను ఎస్ఐ విచారించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆన్‌లైన్ రికార్డుల్లో మరోసారి మార్పులు చోటుచేసుకున్నాయి. పాత అసెస్మెంట్ నంబర్ 614ను తొలగించి.. దాని స్థానంలో కొత్తగా 843 నంబర్‌ను నమోదు చేయడంతోపాటు స్థల విస్తీర్ణాన్ని తిరిగి 98 గజాలుగా మార్చినట్లు తెలుస్తోంది. అసలు అధికారుల ప్రమేయం లేకుండా ఈ మార్పులు ఎలా జరిగాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### మరిన్ని రికార్డులపైనా అనుమానాలు

ఫిర్యాదు చేసినా, విచారణ జరిగినా ఆన్‌లైన్ రికార్డుల్లో వరుసగా మార్పులు చోటుచేసుకోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామపంచాయతీల పరిధిలోని ఆస్తుల రికార్డుల్లోనూ ఇలాంటి మార్పులు జరుగుతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## దోమకొండలో జోరందుకున్న విష జ్వరాలు

- వైరల్ ఫీవర్ , డయేరియాతో ఆస్పత్రికి క్యూ కడుతున్న ప్రజలు
- రోజుకు సుమారు 400 మంది వరకు ప్రభుత్వాస్పత్రికి రాక
- వైద్య సేవలు సక్రమంగా అందడం లేదంటూ రోగుల ఫిర్యాదు
- అటెండర్లతోనే సెలైన్ ఎక్కిస్తున్నారని ఆరోపణలు

**ప్రజా వాయిస్–దోమకొండ:** దోమకొండ మండలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో విష జ్వరాలు, వైరల్ ఫీవర్, డయేరియా తదితర అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమకొండ ప్రభుత్వాస్పత్రికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివస్తుండటంతో ఆస్పత్రి ప్రాంగణంలో రద్దీ నెలకొంటోంది. రోజుకు సుమారు 400 మంది వరకు వైద్య సేవల కోసం వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపం, కలుషిత నీరు, ఆహారం కారణంగా డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పీడియాట్రిషన్ వెంకటేశ్వర్లు తెలిపారు. దోమల వ్యాప్తి పెరగడంతో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### వైద్య సేవలపై ఫిర్యాదులు

ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. సెలైన్ ఎక్కించే బాధ్యతను అటెండర్లకు అప్పగిస్తున్నారని, దీంతో వైద్య సిబ్బందితో రోగులు, వారి బంధువులు వాగ్వాదానికి దిగుతున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సిబ్బంది, సేవలు అందుబాటులో ఉండాలని వారు కోరుతున్నారు.

### అప్రమత్తతే రక్షణ

వర్షాకాలంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. కలుషిత ఆహారం తీసుకోవద్దని, ఫిల్టర్ చేసిన నీటినే తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.





## దోమకొండకు బస్సుల కొరత

- జేబీఎస్ కు ఎక్స్ ప్రెస్ లు ఏవీ.?
- బస్టాండ్ లో కంట్రోలర్ ను నియమించాలి
- దోమకొండ నుంచి జేబీఎస్ కు నేరుగా సర్వీసులు నడపాలి
- రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి

**ప్రజా వాయిస్,దోమకొండ:** పాత తాలూకా కేంద్రంగా ఉన్న దోమకొండ మండల కేంద్రం నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు నేరుగా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 20 వేల జనాభా ఉన్న దోమకొండ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నా.. నేరుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.ప్రస్తుతం బీబీపేట వైపు నుంచి వచ్చే బస్సులపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో అవి దోమకొండకు చేరేసరికే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోందని తెలిపారు. దీంతో బస్సుల్లో ఎక్కేందుకు, సీట్లు లభించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దోమకొండ నుంచి జేబీఎస్‌కు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

### కంట్రోలర్ లేక అవస్థలు

దోమకొండ మీదుగా రోజూ సుమారు 100 బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ప్రయాణికులకు సరైన సమాచారం అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. వెంటనే బస్టాండ్‌కు కంట్రోలర్‌ను నియమించడంతోపాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

## వానొస్తే.. వంతెన బంద్



- బిక్కేరు వాగుపై లో లెవల్ బ్రిడ్జితో ఏటా అవస్థలు
- వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరద
- తెగిపోతున్న పలు గ్రామాల రాకపోకలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా ఎత్తు పెంపు ఊసే లేదు
- హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు

**ప్రజా వాయిస్,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని మొరిపిరాల,ఆత్మకూరు గ్రామాల పొలిమేరలో ఉన్న బిక్కేరు వాగుపై లో లెవల్ బ్రిడ్జి ప్రజలకు ఏటా కష్టాలు తెచ్చిపెడుతోంది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జిపై నుంచి నీరు పొంగిపొర్లి రాకపోకలు నిలిచిపోతున్నాయి.మొరిపిరాల, సింగారం, కాల్వపల్లి, చందపల్లి, మోదుగుంట, చిన్నగూడెం తదితర గ్రామాల ప్రజలు ఆత్మకూరు మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

### హామీలు ఎన్నో.. పనులు ఏవీ.?

బ్రిడ్జి ఎత్తు పెంచుతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నా ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# కరీంనగర్ లో చికెన్ వ్యర్థాల దందా..!

- ఆంధ్ర చెరువులకు రోజు టన్నుల కొద్దీ తరలింపు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాల సేకరణ, అక్రమ రవాణా
- కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- వాహనాల్లో తరలిస్తుండగా దారంతా దుర్గంధం
- రోడ్లపై వ్యర్థాల ద్రవాలు
- చేపల చెరువుల్లో మేతగా వినియోగంపై ఆందోళన
- అధికారుల తనిఖీలపై అనుమానాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్




**ప్రజా వాయిస్, కరీంనగర్:**కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చికెన్ వ్యర్థాల దందా జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని వందలాది చికెన్ సెంటర్ల నుంచి ప్రతిరోజూ వెలువడే వేలాది కిలోల కోడి వ్యర్థాలు, ఈకలు, ప్రేగులను నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించాల్సి ఉన్నా.. కొందరు దళారులు వాటిని అక్రమంగా సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

### రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా..

చికెన్ సెంటర్ల నిర్వాహకుల నుంచి తక్కువ ధరకు వ్యర్థాలను కొనుగోలు చేస్తున్న దళారులు.. వాటిని కంటైనర్లు, గూడ్స్ వాహనాల్లో రాత్రివేళల్లో తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా, గోదావరి జిల్లాల్లోని చేపల చెరువులకు వీటిని మేతగా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం వ్యర్థాలను రెండరింగ్ ప్లాంట్లకు తరలించి పర్యావరణానికి హాని కలగకుండా నిర్మూలించాల్సి ఉన్నా.. అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

### దుర్గంధంతో జనం ఉక్కిరిబిక్కిరి

చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వ్యర్థాల నుంచి స్రవించే ద్రవాలు రోడ్లపై పడుతుండటంతో పరిసరాలు కలుషితమవుతున్నాయని, అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చేపల మేతగా.. ఆరోగ్యంపై ఆందోళన

చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలను మేతగా వినియోగించడం వల్ల పర్యావరణంపై ప్రభావం పడటంతో పాటు, వాటి వినియోగంపై కూడా ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు శాస్త్రీయంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల నిఘా ఎక్కడ.?

కరీంనగర్ నుంచి సరిహద్దులు దాటి భారీగా చికెన్ వ్యర్థాలు తరలుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ మున్సిపల్, పోలీస్, రవాణా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెక్‌పోస్టులను దాటుకుని వాహనాలు వెళ్తున్నా తనిఖీలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వ్యర్థాల అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

## మొక్క నాటుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం

- హాలియా పురపాలక సంఘంలో ఘనంగా వన మహోత్సవం
- హరిత హాలియా – మనందరి బాధ్యత



**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంహరిత హాలియా మనందరి బాధ్యత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక 11వ వార్డు అనుముల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మొక్క నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. హాలియా పట్టణాన్ని పచ్చదనంతో నిండిన హరిత హాలియాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీని హరిత హాలియాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పట్టణంలో విరివిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించడం ద్వారా సుందరమైన, పచ్చని హాలియాను నిర్మించుకోవచ్చని తెలిపారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ , 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజ్జహర్ మొయినుద్దీన్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 11వ వార్డు కౌన్సిలర్ దీపావత్ ప్రసాద్ నాయక్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు యడవెల్లి రంజిత్, కో–ఆప్షన్ సభ్యులు ఎం.డి. రషీద్ , చెన్ను రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది, ఐటీఐ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పాపన్నపేట ఎఫ్ సి ఐ గోదా ఇన్చార్జ్ ఇష్టారాజ్యం?

- గడువు ముగుస్తున్న రేషన్ డీలర్లకు పంపిణీ చేయని పీడీఎస్ బియ్యం?
- గ్రామాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్లు

**ప్రజా వాయిస్, పాపన్నపేట** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలుపు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు ఆగస్టు,సెప్టెంబర్ అక్టోబర్, మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశించినప్పటికీ ఎఫ్ సి ఐ గోదాం ఇన్చార్జి ఇష్టారాజ్యం మూలంగా ఇప్పటివరకు కొన్ని గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీ కాకపోవడంతో రేషన్ కార్డు దారులు ఆకలితో అలమటిస్తున్నారు. పాపన్నపేట మండల కేంద్రంలో ఎఫ్ సి ఐ గోదాం నిల్వ ఉంది. ఇక్కడి గోదాం నుండి పాపన్నపేట, టేక్మాల్ మండలాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీ జరుగుతుంది. కాగా మూడు నెలలు రేషన్ బియ్యం పంపిణికి ప్రభుత్వం ఆగస్టు 31వ తేదీలోగా బియ్యం పంపిణీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించినప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న గోదాం ఇన్చార్జి నరసింహారావు మాత్రమే తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తూ తనకు నచ్చిన గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని కొందరు రేషన్ డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడువు సమీపిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో బియ్యాన్ని తమ షాపులకు పంపిణీ చేయకపోవడంతో రేషన్ కార్డు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే బియ్యాన్ని సరఫరా చేయాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు....

## మిరుదొడ్డిలో హాస్టల్ భవనం నుంచి దూకిన ఏడవ తరగతి విద్యార్థిని

- మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్లో ఘటన

**ప్రజా వాయిస్ మిరుదొడ్డి.** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్లో మంగళవారం ఉదయం 7వ తరగతి విద్యార్థిని హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకిన సంఘటన చోటు చేసుకుంది.. గమనించిన హాస్టల్ సిబ్బంది అప్రమత్తమై 108 సహాయం ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హాస్టల్ సిబ్బంది తెలిపారు. మెరుగైన వైద్య సదుపాయం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు హాస్టల్ భవనం నుంచి దూకిన విద్యార్థిని భూంపల్లి గ్రామానికి చెందిన వర్షిని ఏడవ తరగతి చదువుతుంది. హాస్టల్ భవనం నుంచి దూకిన విషయాన్ని తెలుసుకున్న ఇతర విద్యార్థినిల తల్లిదండ్రులు హాస్టల్ కు చేరుకున్నారు దీంతో హాస్టల్ ఆవరణంలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది అయితే విద్యార్థిని భవనం పై నుంచి ఎందుకు దూకుంది అనే వివరాలు తెలియాల్సి ఉంది.







## రెండున్నరేళ్లుగా 'స్కూల్' పనులు పెండింగ్

- రోడ్డుపైనే వందమంది విద్యార్థుల చదువులు..
- భవన నిర్మాణం పూర్తి చేయాలని బీఆర్ ఎస్ వీ డిమాండ్
- నిధులు, పనులు నిలిచిపోవడానికి కారణాలపై స్పష్టత ఇవ్వాలని వినతి

**ప్రజా వాయిస్,హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణం 15వ వార్డు ముత్యాలమ్మ వీధిలోని యూపీఎస్–1 పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు రెండున్నరేళ్లుగా నిలిచిపోవడంపై బీఆర్ఎస్‌వీ నాయకుడు జనిగ సందీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల భవనం లేక సుమారు 100 మంది విద్యార్థులు రోడ్డుపైనే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు.పాఠశాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం హుజూర్‌నగర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన పనులు ప్రభుత్వం మారిన తర్వాత కూడా పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.పాఠశాల నిర్మాణానికి మంజూరైన నిధులు ఎంత ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు పనులు మధ్యలోనే ఎందుకు నిలిచిపోయాయి అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని జనిగ సందీప్ డిమాండ్ చేశారు.



## నాటడమే కాదు.. మొక్కను కాపాడటం కూడా మన బాధ్యత

- పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్ కు బాటలు
- వన మహోత్సవంలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.
- హాజరైన ఆర్డీఓ.రమణారెడ్డి,మున్సిపల్ చైర్మన్ సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా,ఫారెస్ట్ అధికారి గౌతమ్.

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్:** పచ్చదనం పెంపొందించి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మిర్యాలగూడలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ డివిజన్ అటవీ శాఖ, మిర్యాలగూడ మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (BLR) పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం ఒక బాధ్యత అయితే, వాటిని సంరక్షించి పెద్దవిగా పెంచడం అంతకంటే ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు.పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు మున్సిపాలిటీ, అటవీ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను కాపాడేందుకు, వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రమణా రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సిగ్నల్స్ మొరాయే.. వాహనాలు జమయే

- జహీరాబాద్ లో నిత్యం ట్రాఫిక్ కష్టాలు
- భవానీ మందిర్ ,హనుమాన్ మందిర్ రోడ్డు చౌరస్తాలో అవస్థలు
- మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు.. చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**ప్రజా వాయిస్,జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. భవానీ మందిర్,హనుమాన్ మందిర్ రోడ్డు చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో నిత్యం వాహనాల రద్దీ ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు.సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ట్రాఫిక్ సిగ్నల్స్ మొరాయించి చాలాకాలం అవుతున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు వెంటనే సిగ్నల్స్‌ను బాగు చేయడంతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## జయవీరుని జల చొరవ.. అనుముల దాహార్తికి భరోసా!

- అనుముల చెక్ డ్యామ్ కు నీరు చేరేలా ప్రత్యేక చర్యలు
- తాగునీటితో పాటు రైతుల సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి
- నీటి సమస్యకు చెక్ పెట్టిన ఎమ్మెల్యే కుందూరు జయవీర్



**ప్రజా వాయిస్,నాగార్జునసాగర్** నియోజకవర్గంలోని అనుముల గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే కుందూరు జయవీర్ ప్రత్యేక జల చొరవ తీసుకున్నారు. అనుముల చెక్‌డ్యామ్‌కు నీరు చేరేలా అనుముల వాగులోకి నీటిని విడుదల చేయించి, గ్రామ ప్రజలకు, రైతులకు నీటి భరోసా కల్పించారు.ఎండాకాలంలో తాగునీటి కోసం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడకుండా, ముందస్తుగానే నీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే జయవీర్ చర్యలు చేపట్టారు. చెక్‌డ్యామ్‌లో నీరు అందుబాటులో ఉంటే గ్రామ తాగునీటి అవసరాలు తీరడంతో పాటు, రైతులకు కూడా సాగునీటి సౌకర్యం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు.ప్రజలకు నీరు అంటే కేవలం ఒక అవసరం మాత్రమే కాదు.. ప్రతి కుటుంబ జీవనానికి, ప్రతి రైతు భవిష్యత్తుకు సంబంధించిన అంశమనే భావనతో ఎమ్మెల్యే జయవీర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అనుముల గ్రామ ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా, రైతుల సాగునీటి అవసరాలను తీర్చేలా ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రజలకు భరోసా నిస్తున్నాయి.ఒకవైపు గ్రామాల తాగునీటి అవసరాలు, మరోవైపు రైతుల సాగునీటి సమస్యలను సమన్వయం చేస్తూ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ తీసుకున్న ఈ జల చొరవ పట్ల అనుముల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను గుర్తించి, అవి తీవ్రరూపం దాల్చకముందే పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే తీసుకుంటున్న ముందస్తు చర్యలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

# జంట హత్యల కేసులో కఠిన శిక్షలు

**బాధిత కుటుంబానికి రూ.4.2 లక్షల పరిహారం అందజేత**

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు కేసు.. త్వరగా శిక్ష పడేలా చర్యలు**

**డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు.. స్పెషల్ అడ్వకేట్ సహకారం**

**ప్రజా వాయిస్,మోతే:**

సూర్యాపేట జిల్లా మోతే మండలం బిక్యా తండాలో దారుణ హత్యకు గురైన దంపతులు నాగులు, బుబా కుటుంబానికి జిల్లా యంత్రాంగం అండగా నిలిచింది. మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ బాధితుల ఇంటికి వెళ్లి వారి కుమార్తెలు జ్యోతి, సంధ్యలను పరామర్శించి ఓదార్చారు. అట్రాసిటీ కేసు కింద అందాల్సిన ఆర్థిక సాయంలో మొదటి విడతగా 50 శాతం రూ.4.2 లక్షలు బాధితుల ఖాతాలో జమ చేసినట్లు



తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు.కలెక్టర్ మాట్లాడుతూ..ఘటన అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసులో ప్రతి ఆధారాన్ని పోలీసులు నిశితంగా సేకరిస్తున్నారని, త్వరగా చార్జ్‌షీట్ సిద్ధం చేసి కోర్టుకు పంపిస్తామని తెలిపారు. నిందితులకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. హత్య జరిగిన 24 గంటలు గడవకముందే నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు. లోతైన దర్యాప్తు కోసం డీఎస్పీని దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలు సేకరిస్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా నిపుణులైన స్పెషల్ అడ్వకేట్ సహకారం తీసుకుంటున్నామని, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు పంపించి త్వరగా విచారణ పూర్తయ్యేలా కృషి చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాధవ్, తహసీల్దార్ వెంకన్న, సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి...

**- రూ.15 వేల కోట్ల నిధులు చెల్లించకపోవడం దారుణం**

**- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఉద్యమం ఉధృతం చేస్తాం**

**- గుజ్జుల రామకృష్ణారెడ్డి**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పిలుపు మేరకు 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ వైశ్యభవన్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు ఆధ్వర్యంలో, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీనివల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నిధులను కళాశాలల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు చేపట్టిన 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' కార్యక్రమానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో బీజేపీ కార్యాలయంలోనే రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా పదాధికారులు శనిగరపు రమేష్, గర్రెపల్లి నారాయణస్వామి, కామనీ రాజేంద్రప్రసాద్, వెల్లంపల్లి శ్రీనివాస్‌రావు, ఎల్లంకి రాజు, మాట నర్సింగం,



చాతరాజు రమేష్, జంగ చక్రధర్‌రెడ్డి, కొమ్ము తిరుపతి యాదవ్, నాగుల మల్యాల తిరుపతి, పర్స సమ్మయ్య, పల్లె ఓదెలు, భూషణవేణి శ్రీనివాస్, కంకణాల జ్యోతిబసు, కందునూరి కుమార్, గజబింకర్ పవన్, చిట్టవేణి సదయ్య, భూసారపు సంపత్, గుడ్ల వెంకటేష్, నూనె మహేష్‌పటేల్, బుర్ర సతీష్‌గౌడ్, శేఖర్ మాస్టర్, శ్రీనివాస్‌రెడ్డి, వేల్పుల వెంకటేష్, తోట శ్రీనివాస్, సిలువేరు ఓదెలు, పోచంపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

**భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే వన మహోత్సవం లక్ష్యం: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :**

వన మహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు.మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి పెద్దవిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు.వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని చెప్పారు.అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఇంటి వద్ద ,పరిసరాలలో నాటుకునేలా అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనివల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంపొందడంతో పాటు పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని, తద్వారా మొక్కల వివరాలను నమోదు చేసి వాటి సంరక్షణపై పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, డీఆర్‌డీఓ జ్యోతి, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, పీసీబీ అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ




చలపతిరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తహసీల్దార్ జయరాం నాయక్, అటవీ శాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు లేని పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం....

**ప్రజా వాయిస్/ అనుముల:**

నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన జూపల్లి ధనమ్మ--రామలింగయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు పక్కా ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు.నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు



జయవీర్ రెడ్డి నియోజకవర్గంలోని ఇల్లు లేని పేద కుటుంబాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా నిరంతరం కృషి చేస్తున్నారని చైర్మన్ పేర్కొన్నారు. పేదల కష్టాలను గుర్తించి, వారి సొంతింటి కల నెరవేర్చేందుకు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా ఆత్మగౌరవంతో జీవించే భరోసాను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని అన్నారు.ఈ సందర్భంగా జూపల్లి ధనమ్మ--రామలింగయ్య కుటుంబ సభ్యులకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో 2 వ వార్డ్ కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు 6 వ వార్డ్ కౌన్సిలర్ సలహాదారు మజహార్ మోహిద్దీన్ 9 వ వార్డ్ కౌన్సిలర్ చేరుపల్లి ముత్యాలు కాంగ్రెస్ నాయకులు కూనరెడ్డి కృష్ణారెడ్డి, అన్వారుద్దీన్, గార్లపాటి మహేష్, పసుపులేటి సంతోష్, పోలె మధు, శివ, అనిల్, లక్ష్మణ్, మునిసిపల్ సిబ్బంది వెంకటయ్య, సతీష్ మాస్రత్ తదితరులు పాల్గొన్నారు



# రైస్ మిల్ కార్మికుల గోడు.. పరిష్కారానికి హామీ

**శ్రమదోపిడీ, జీతభత్యాలు, పని గంటల సమస్యలను ఐఎన్‌టీయూసీ నేత దృష్టికి తీసుకెళ్లిన కార్మిక నాయకులు**

**సమస్యలను సానుకూలంగా విన్న బాబర్ సలీం పాషా**

**సంబంధిత స్థాయిలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**

**ప్రజా వాయిస్,సుల్తానాబాద్:**

రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ నేషనల్ సెక్రటరీ బాబర్ సలీం పాషా హామీ ఇచ్చారు. మంగళవారం రామగుండంలోని ఎన్టీపీసీలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రైస్ మిల్ కార్మిక నాయకులు ఆయనను కలిశారు.ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న శ్రమదోపిడీ, జీతభత్యాలు, పని గంటలు తదితర సమస్యలను సలీం పాషా దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా విన్న ఆయన.. సంబంధిత స్థాయిలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో రైస్ మిల్ కార్మిక నాయకులు పురం హరికిషన్, వేగోళపు శంకర్ గౌడ్, చొప్పరి శ్రీనివాస్ రెడ్డి, ఐలయ్య, పోచవేని బాలకిషన్, చొప్పరి వెంకటేష్, కంకణాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య**

**ప్రజా వాయిస్ గోదావరిఖని**



ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడమే తమ మొదటి ప్రాధాన్యతని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 41వ డివిజన్ కార్పొరేటర్ (సిపిఐ) మార్కపురి సూర్య తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి తీవ్ర ఇబ్బందులు తలెత్తకుండా ఆయన 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఇటీవల డివిజన్ లో షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన స్ట్రీట్ లైట్ల స్థానంలో వెంటనే కొత్త లైట్లను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా వీధి దీపాలు వెలగడం లేదంటూ స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన తక్షణమే స్పందించారు. అడ్డూరి సంపత్ బాబాయ్ ఇంటి వద్ద, అలాగే జనహిత పూర్ణ శ్రీనన్న ఇంటి వద్ద వీధి దీపాలకు నిపుణులతో వెంటనే రిపేర్లు చేయించి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సూర్య మాట్లాడుతూ...డివిజన్ ప్రజలకు ఏ సమస్య వచ్చినా నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేయడానికి సిద్ధంగా ఉంటాం. వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో పాటు ప్రతి ప్రజా సమస్యను పరిష్కరించడమే మా ప్రధాన ధ్యేయం అని పేర్కొన్నారు. సమర్థవంతంగా సమస్యలను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ సూర్యకు డివిజన్ ప్రజలు అభినందనలు తెలిపారు.

# ఆది వరాహ స్వామిని దర్శించుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ (వాసు)

**జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు**

**ప్రజా వాయిస్ కమాన్ పూర్**



శ్రావణ మాస మహోత్సవాలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో స్వయంభూగా వెలసిన శ్రీ ఆదివరాహ స్వామి వారిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆసంపల్లి శ్రీనివాస్ (వాసు) ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆయనకు నాయకులు, భక్తులు స్వాగతం పలికారు. ?ఈ సందర్భంగా స్వామివారికి శ్రీనివాస్ (వాసు) ప్రత్యేక పూజలు, అర్చనాది క్రతువులు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... శ్రావణ మాసం పవిత్రమైన రోజుల్లో జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఇంట్లో లక్ష్మీదేవి కటాక్షం కలిగి, సీమంతా పాడిపంటలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవం

**మొక్కలు నాటిన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాల బాలికల ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యార్థి దశ నుంచే మొక్కల ప్రాధాన్యత తెలుసుకుని సంరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని, మొక్కలు పెద్దవిగా పెరిగినప్పుడే కార్యక్రమం సార్థకమవుతుందని వివరించారు. పచ్చదనం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పవార్ లింబారావ్, కూద్మేత జంగు, బండ మీనారెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నవారు




# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

**ఆత్రం సుగుణ , ఎమ్మెల్సీ దండే విఠల్**

**ప్రజా వాయిస్ బెజ్జూర్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా బెజ్జూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు పంద్రం పుష్పలత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు బలోపేతం చేయాలని, పార్టీ కోసం కృషి చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మండల, గ్రామ, బూత్ స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే బెజ్జూర్ మండలంలో పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని వివరించారు.

# వనమహోత్సవ పనులపై అధికారుల పరిశీలన

**భూపాలపట్నంలో మాస్ ప్లాంటేషన్.. లబ్ధిదారుల ఇళ్లకూ పరిశీలన**



**ప్రజా వాయిస్,సిర్పూర్(టి):**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామపంచాయతీలో వనమహోత్సవంలో భాగంగా చేపట్టిన మాస్ ప్లాంటేషన్ పనులను అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీవో చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాజభోజ్, సర్పంచ్ కోరివేత రాజారాం, ఉపసర్పంచ్ కే.శ్రీనివాస్ పాల్గొన్నారు. నర్సరీలు, మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధిహామీ కూలీలకు వివరించారు. ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎల్-1 జాబితాలో ఉన్న లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు చేసిన దామెర పోలీసులు

**సుమారు 1 కోటి 25లక్షల విలువగల 251 కిలోల గంజాయి,**

**ఒక ద్విచక్ర వాహనం, 9వేల రూపాయల నగదు,ఒక సెల్‌ఫోన్ స్వాధీనం**



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా, వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని .వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్ అధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుత్ను నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి.

ముదిగొండ నాగేశ్వర్ రావు, వయస్సు 55, పులుకుర్తి గ్రామం, దామెర మండలం, హన్మకొండ జిల్లా. ఇతను సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితుడు తనకు వున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్ మరియు సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోబడింది. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగింది.

మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు వినియోగంపై తెలంగాణ పోలీస్ విభాగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడంతో పాటు, విక్రయదారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాము. మత్తు పదార్థాల కట్టడికై ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించాలని ప్రధానంగా ఎవరైన గంజాయి విక్రయాలకు పాల్పడిన, వినియోగించిన స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్లని వరంగల్ కమిషనర్ అభినందించారు..

# జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేసి,శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

**పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి**

**ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున**



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన శక్తి పాలసీ మరియు టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమఖ్య హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏ.ఓ. గౌరీ శంకర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ సాంకేతిక విద్యా వ్యవస్థను శక్తి పాలసీలో విలీనం చేసి, ఐటిఐలతో కలపడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సింది పోయి, కేవలం మార్కెట్ ఆధారిత చౌక కార్మిక శక్తిని తయారు చేసే కేంద్రాలుగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా తెచ్చిన జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్ బి టేట్)ని స్వతంత్ర శాఖగా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్ స్కాలర్షిప్ల విడుదల కాక సుమారు 14 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది విద్యార్థులు పై చదువులు చదువుకోవడానికి ఉద్యోగం చేసుకోవడానికి సర్టిఫికెట్స్ తీసుకోవడానికి కాలేజీలకు వెళ్తే కాలేజ్ యాజమాన్యం ఫీజు కడితేనే సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడం జరుగుతోంది దాని వలన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు కావున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాశీ. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డం రామ్ చరణ్, దినేష్, రాజు, విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి




**మిర్యాలగూడ, ప్రజా వాణి:** అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యావిధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న విద్యా రుసుము తిరిగి చెల్లింపులు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇవి విడుదల కాకపోవడంతో సుమారు 14 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పై చదువులు, ఉద్యోగాల కోసం అవసరమైన ధ్రువపత్రాలను కళాశాలల యాజమాన్యాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.కావున పెండింగ్‌లో ఉన్న విద్యా రుసుము తిరిగి చెల్లింపులు, ఉపకార వేతనాలను సత్వరమే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో కిరణ్, పృథ్వి, మధు, మనోహార్, క్రాంతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం మండల వాయిద్య కళాకారుల సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

**ప్రజా వాయిస్, బయ్యారం.**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో తెలంగాణ వాయిద్య కళాకారుల సంఘం మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బయ్యారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవు రాచర్ల శేఖర్, జిల్లా అధ్యక్షుడు పెద్దమాములు రాజు శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మండల అధ్యక్షుడిగా ఎస్‌కే. నాణుల మీరా, ఉపాధ్యక్షుడిగా గారె బాబు, మండల కార్యదర్శిగా వేదమిళ్ల సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే. మైబు, చండ, కోర నవీన్, మనోహర్, మనోజ్, సభ్యులుగా బూరొండ్ల ఉదయం, లక్ష్మీనర్సింహ తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. వాయిద్య కళాకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



**కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కల్పించాలి..**

గ్రామీణ ప్రాంతాల్లో వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, జాతరలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వాయిద్య కళాకారులు తమ కళను ప్రదర్శిస్తూ తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతున్నారని సంఘం నాయకులు తెలిపారు. అయితే వాయిద్య కళను వృత్తిగా కొనసాగిస్తున్న అనేక మంది కళాకారులకు సరైన ప్రభుత్వ గుర్తింపు, సామాజిక భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వాయిద్య కళాకారుల వివరాలను అధికారికంగా నమోదు చేసి ప్రత్యేక కళాకారుల గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కళాకారుల కోసం అందుబాటులో ఉన్న ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**పింఛన్, హెల్త్ కార్డులు ఇవ్వాలి..**

వయస్సు పైబడిన, కళను నమ్ముకుని జీవిస్తున్న వాయిద్య కళాకారులకు ప్రభుత్వం నెలవారీ పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కళాకారులు, వారి కుటుంబాలకు వైద్య భద్రత కల్పించేందుకు ప్రత్యేక హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.అదేవిధంగా కళాకారుల పిల్లల విద్యకు సహాయం, వాయిద్య పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం, కళా ప్రదర్శనలకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కళాకారులకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించి వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.నూతనంగా ఎన్నికైన బయ్యారం మండల కమిటీ ఆధ్వర్యంలో వాయిద్య కళాకారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ గుర్తింపు, పింఛన్, హెల్త్ కార్డులు తదితర హక్కులు సాధించే వరకు సంఘటితంగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు...

# వన మహోత్సవంతోనే పర్యావరణ పరిరక్షణ:

## సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామంలో మంగళవారం ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా, గ్రామంలోని హనుమాన్ వెంచర్ ప్రాంతంలో గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి వార్డు సభ్యులు మరియు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, బల్గూరి శివ, పట్నం బాలకృష్ణ గౌడ్, సభావత్ రఘునాయక్, సింగపంగా ప్రశాంతి రమేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, టీఏ సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, కారోబార్ పున్నం యాదగిరి, నాయకులు పాల అంజయ్య, రత్తుపల్లి యాదయ్య, రేవనపల్లి గోపాల్, ఎర్రోళ్ల లింగస్వామి, గునిగంటి రాజు గౌడ్, రాచకొండ రమేష్, బానోతు కిరణ్ నాయక్, కొండ నవీన్ గౌడ్, బానోతు గణేష్ నాయక్, గ్రామ యువకులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 4 విండోలకు చైర్మన్ ల నియామకం

## ఉత్తర్వులు అందజేసిన సహకార శాఖ కమిషనర్

**ప్రజా వాయిస్ కామారెడ్డి/**
కామారెడ్డి నియోజకవర్గంలోని 4 సింగిల్ విండోల చైర్మన్ లను నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కొత్త చైర్మన్ లకు అందజేశారు. దోమకొండ చైర్మన్గా అనంతరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రామేశ్వర్ పల్లి సునీల్ విండో చైర్మన్ గా బద్దం ఇంద్రకరణ్ రెడ్డి నీ నియమించారు. లక్ష్మీ దేవునిపల్లి సొసైటీ చైర్మన్ గా సుధాకర్ రెడ్డి నేను ఏమి ఇచ్చారు. మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్ గా నోసిల్లాలని నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కాలువలో పడి వ్యక్తి మృతి

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధి సీతారామ ప్రాజెక్ట్ రాజీవ్ కెనాల్ కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీస్ కథనం ప్రకారం వినోబానగర్ గ్రామానికి చెందిన బోడా నాగయ్య (45) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడినట్లు తెలిపారు. సమీపంలో ఉన్న వ్యవసాయ కూలీలు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని, వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని నాగయ్యను నీటిలో నుంచి బయటకు తీసి, కొద్దిగా ఊపిరి ఉన్నట్లు గుర్తించి అంబులెన్స్ ద్వారా జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. నాగయ్య మృతి పై ఎటువంటి అనుమానం లేదని, వారి కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు.





# బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలి

## మండల్ కమిషన్ సిఫారసులతో ఓబీసీలకు కొత్త అవకాశాలు

## బీసీలకు నేటికీ అన్యాయం జరుగుతోంది: కుందేళ్ల అర్జున్‌యాదవ్

## మండల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**ప్రజా వాయిస్,వనపర్తి:**
సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేసిన బీపీ మండల్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని వనపర్తి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కుందేళ్ల అర్జున్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీపీ మండల్ 108వ జయంతి సందర్భంగా వనపర్తి రాజీవ్‌చౌక్‌లో గైనికాడి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లకు మండల్ కమిషన్ సిఫారసులు పునాది వేశాయని అన్నారు. వాటి అమలుతో వెనుకబడిన వర్గాల యువతకు విద్య, ఉద్యోగాల్లో కొత్త అవకాశాలు లభించాయని తెలిపారు. నేటికీ బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యంలో సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.





# తెలంగాణ ఉద్యమకారులను మరిచిన ప్రభుత్వం

## ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన హామీలను అమలు చేయాలని మిరుదొడ్డిలో టియుజెఏసీ ఆధ్వర్యంలో మహాధర్న

**ప్రజా వాయిస్ మీరు దొడ్డి**
సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డిలో టీయూజేఏసీ ఆధ్వర్యంలో మహాధర్న నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారులు ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు మాట్లాడుతూ కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఇంతవరకు సరైన ఉద్యమకారులను గుర్తించక కేవలం పార్టీలకు పరిమితమైన కేకే కమిటీ ఇప్పటికైనా గుర్తించి టియుజెసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను గుర్తించి ఈ రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిడిదొడ్డిలో లో మహా ధర్నా చెప్పడం జరిగిందిఈ సందర్భంగా టీజేసి నాయకులు సూకూరి లింగం శ్రీనివాస్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ కోల విజయకుమార్ రాష్ట్ర సెక్రటరీ నందిని మాస్టర్ కొమ్ము శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల కోసం మేనిఫెస్టో పెట్టిందో మేనిఫెస్టో పెట్టిన ప్రకారం తెలంగాణలోని ఉద్యమకారులు అందరికీ ప్రభుత్వం ఇస్తానన్న హామీలు కచ్చితంగా ఇవ్వాలని 250 గజాల ఇళ్ళ స్థలం 25 వేల పెన్షన్ ఇస్తానని ప్రకటించడంతో ప్రభుత్వం కేకే కమిటీని నియమించింది కేక్ ఏ కమిటీ కాలయాపన కాకుండా నిజమైన ఉద్యమకారులను గుర్తించి కాలయాపన చేయకుండా త్వరగా ఉద్యమకారులను గుర్తించాలని ఈ సందర్భంగా తెలిపారు లేని పక్షంలో సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పూడూరి శ్రీనివాస్ వడ్ల శ్రీనివాస్ మల్లేశం రమేష్ గౌడ్ వల్లాల సత్యనారాయణ దార మల్లయ్య ధార స్వామి బలిజ రమేష్ కొమ్ము శంకర్ వడ్డే రవి బిక్షపతి స్వామి పాల్గొన్నారు అనంతరం తాసిల్దార్ కు మండల పరిషత్ అధికారికి మెమోరడం ఇవ్వడం జరిగింది..

# మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేసిన ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ ఖాజా గౌస్




**ప్రజావాయిస్, ఇల్లందు(ఆగస్టు25):**
మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ ఖాజా గౌస్ మొయినుద్దీన్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిలాద్ ఉన్ నబీ అంటే ప్రవక్త పుట్టినరోజు అని అర్థమని మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు నాడు మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన బోధనలు, మానవత్వం, ప్రేమ, కరుణ, సహనం, నిజాయితీ, సోదరభావాన్ని అనుసరిస్తూ ప్రతిఒక్క ముస్లిం నిజజీవితంలో తప్పక పాటించాలని ఖాజా గౌస్ సూచించారు. మిలాద్ ఉన్ నబీ పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబసభ్యుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని అల్లా ఆశీస్సులు ముస్లిం సోదర సోదరీమణులతో పాటు ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ ఖాజా గౌస్ మొయినుద్దీన్ పేర్కొన్నారు.




# వన సంరక్షణ- అందరి భాద్యత ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలి

**ప్రజా వాయిస్ కొత్తగూడ**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని ఓటాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలు అనగా రావి,నేరేడు, కానుగ, వేప, బాదం మొక్కలను నాటినారు ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వన మహోత్సవం కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం కోసం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్య కరమైన వాతావరణం ను అందించడం కొరకే ఈ కార్యక్రమం కావున ప్రతి ఒక్కరు బాధ్యతగా ఒక మొక్కను నాటి సంరక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో వన ప్రేమి, ఆంగ్ల ఉపాధ్యాయులు డాక్టర్ పులుసం సాంబయ్య, ఉపాధ్యాయ బృందం అజ్మీరా కోటేశ్వర్, భూక్యా దశరథ్ కుమార్, భూక్యా రమేష్, పినబోయిన శ్యామల,మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# పలిమెల మండలంలో ఘనంగా వన మహోత్సవం

## - సర్వాయిపేటలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



**ప్రజా వాయిస్ పలిమెల**
పర్యావరణ పరిరక్షణ మరియు గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మంథని నియోజకవర్గ పరిధిలోని పలిమెల మండలం, సర్వాయిపేట గ్రామ పంచాయతీలో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్వాయిపేట గ్రామ సర్పంచ్ లంగారి రాజు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది హాజరై, గ్రామస్థులతో కలిసి విస్తృతంగా మొక్కలు నాటారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ లంగారి రాజు మరియు స్థానిక నాయకులు మాట్లాడుతూ... పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని గుర్తుచేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ?ఈ వన మహోత్సవంలో గ్రామ ప్రజలు, యువకులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# బిఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం

## - ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

## - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**ప్రజావాయిస్/కోట్ పల్లి/బంట్వారం:**
బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. బంట్వారం మండల పరిధిలోని బొప్పనారం, బస్వాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఆయన ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు సరైన రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ.. ప్రజల సమస్యల కోసం పోరాడే పార్టీ బిఆర్ఎస్. కార్యకర్తలే పార్టీకి బలం. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలి అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంట్వారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 8వ కాలనీలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**ప్రజా వాయిస్ గోదావరిఖని**

8వ కాలనీలోని స్థానిక విద్యాసంస్థల్లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల శశి, రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ?ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలలో రక్షాబంధన్ పండుగకు ఎంతో విశిష్టత ఉందని, ప్రేమానురాగాలకు, రక్షణకు ఇది ప్రతీక అని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో సోదరభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

ప్రాంతీయ నేత్ర వైద్యశాల వరంగల్ ఆధ్వర్యంలో నేటి నుండి రెండు వారాల పాటు నేత్ర దాన పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రవిశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వైద్యశాల డాక్టర్లు,సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని నేత్రదానం మహాదానం మనిషి మరణించాక రెండు కండ్లు పూడ్చకుండా,కాల్చకుండా దానం చేస్తే మరో ఇద్దరికి చూపునిచ్చిన వారమవుతామని డాక్టర్ రవిశేఖర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిదేవ్,డాక్టర్ చంద్రభాను వైద్యులు, విద్యార్థులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# నా బిడ్డ ఎక్కడున్నాడో..

- తప్పిపోయిన కుమారుడు..కన్నీటి పర్యంతం అవుతున్న కన్న తల్లి
- ఎవరికైనా ఆచూకీ తెలిస్తే చెప్పండని వినతి
- 15రోజుల క్రితం తప్పిపోయిన ధరూర్ మండలం ధర్మపూర్ గ్రామ యువకుడు



**ప్రజావాయిస్/వికారాబాద్:**

ధరూర్ మండలం ధర్మపూర్ గ్రామానికి చెందిన యువకుడు బుడ్డోళ్ల ప్రవీణ్ కుమార్ గత 15 రోజుల తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆయన తల్లి నర్సమ్మ తన కుమారుడి ఆచూకీ తెలియక తీవ్ర ఆవేదనతో, దిగులుతో తన కుమారుడు క్షేమంగా తిరిగి రావాలని ఆ తల్లి కన్నీటి పర్యంతం అవుతుంది. ప్రవీణ్ కుమార్ ఎక్కడైనా కనిపించినా, ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసినా దయచేసి వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేసి, ఆయనను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు సహకరించాలని తల్లి నరసమ్మ వేడుకుంటుంది. సమాచారం తెలిసిన వారు 9391973368,9010595563,7095380270 సమాచారం అందించవచ్చు.



# కళాకారులకు గుర్తింపు ఎక్కడ

**సంప్రదాయ కళలకు జీవం పోస్తున్న కళాకారులకు ప్రభుత్వం అండగా నిలవాలి**

**జీవన భృతి పెన్షన్ తరహా పథకం అమలు చేయాలని విజ్ఞప్తి**

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని బట్వాన్‌పల్లి గ్రామంలో కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ వాటిని భావితరాలకు అందిస్తున్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని సకల కళాకారుల సంఘం నాయకులు కోరార. సకల కళాకారుల ఆధ్వర్యంలో మహిళా కోలాటం, కళాకారులు, భజన బృందం సభ్యులను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా కళలను నమ్ముకుని ముందుకు సాగుతున్న కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కోలాటం, భజన వంటి సంప్రదాయ కళలు మన సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని, ఆధునిక కాలంలో వీటికి ఆదరణ తగ్గిపోతున్నప్పటికీ కళాకారులు తమ కళలను కొనసాగిస్తూ సంప్రదాయాలను కాపాడుతున్నారని తెలిపారు. కళాకారులకు సరైన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వం కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి ప్రత్యేకంగా జీవన భృతి కల్పించే విధంగా పెన్షన్ తరహా పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సకల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటాచారి, మండల అధ్యక్షులు వెంకటరమణ , కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానించి వారి సేవలను అభినందించారు.



# క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రజా వాయిస్/అడ్డ గూడూరు:**

క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డా. బి.భార్గవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటమర్తిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టీబీ నిర్మూలనలో భాగంగా ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి, అనుమానితులను గుర్తించడం అవసరమైన పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను శిబిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాశం విష్ణువర్ధన్ రావు, వైద్య సిబ్బంది శారద, సరోజన మరియు ఆశావర్కర్లు, బీబీనగర్ ఎయిమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సారంపల్లి మృతి.. రైతాంగానికి తీరని లోటు

**రైతు ఉద్యమానికి ఆయన సేవలు చిరస్మరణీయం**

**ఆశయాల సాధనకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం: దడిపల్లి ప్రభాకర్**

**ప్రజా వాయిస్, మోత్కూరు:**

రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ రైతాంగానికి తీరని లోటని తెలంగాణ రైతుసంఘం మోత్కూరు మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలడుగు గ్రామంలో సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దడిపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగిన సారంపల్లి మల్లారెడ్డి నీటిపారుదల, వ్యవసాయ రంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అధ్యయనం చేశారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలు, పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై రైతులను సమీకరించి, వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనత సారంపల్లి మల్లారెడ్డికి దక్కుతుందన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి లక్ష్మణ్, దడిపల్లి నవనీత, చింతకింది సోమరాజు, మర్రిపల్లి లక్ష్మమ్మ, వడ్డేపల్లి లక్ష్మి, గుండు కవిత, బెల్లి బచ్చమ్మ, చింతకింది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం సరికాదు

**27న జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.**

**టీపిటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య**




**ప్రజా వాయిస్ కొత్తగూడ**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ కొత్తగూడ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం ఆ సంఘం మండల అధ్యక్షులు తీగల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా యుపిఎస్ కొత్తగూడ, ఎంపీపీ ఎస్ బూరుగు గుంపు, పెగడపల్లి ,కొర్ర తండా, లడాయి గడ్డ, ముస్మి, వాల్యాతాండ,ఎద్దులపల్లి ,రంగప్ప గూడెం ,జంగవానిగూడెం ,పొగుళ్లపల్లి పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల సాంబయ్య మాట్లాడుతూ రెండో పిఆర్సి అమలు ,పెండింగ్ లో ఉన్న ఆరు డిఏల విడుదల ,సిపిఎస్ రద్దు అదేవిధంగా పెండింగ్లో ఉన్న బకాయిలు నెలకు రెండు వేల కోట్ల నిధులు విడుదల చేయడం ,ఈ హెచ్ ఎస్ పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వంటి అనేక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఆ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27 తేదీన జిల్లా కలెక్టర్ల కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నవంబర్ ఒకటవ తేదీన పెన్షన్ విద్రోహ దినం ,అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 27 వ తారీఖున నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సూర్యనారాయణ ,యాదగిరి, రవి ,వెంకన్న పాల్గొన్నారు

# చిన్న స్థలాల్లో భారీ భవంతులు..!

**గిరిగిరిగడ్డలో నిబంధనలకు తూట్లు**

**120 గజాల్లో ఏడు ఫ్లోర్లు**

**60 గజాల్లో ఐదు అంతస్తుల మేడలు**

**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:**

గండిపేట మండలం నార్సింగి సర్కిల్ పరిధిలోని గిరిగిరిగడ్డలో చిన్న స్థలాల్లో భారీ భవంతులు వెలుస్తున్నాయి. నిర్మాణ నిబంధనలను పక్కనపెట్టి 120 గజాల్లో ఏకంగా ఏడు ఫ్లోర్లు,60 గజాల స్థలంలో ఐదు అంతస్తులు, నిర్మించిన భవనాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. భవనాల స్లాబులను గ్యాస్ కట్టర్లతో కట్ చేయించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రసిద ఆధ్వర్యంలో చేపట్టిన,ఈ చర్యలతో అక్రమ నిర్మాణదారుల్లో కలకలం రేగింది. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

లచిన్న ప్లాట్ – అంతస్తులు మాత్రం భారీగాలి!


గిరిగిరిగడ్డలో చిన్న స్థలాల్లోనే అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 120 గజాల్లో ఏడు అంతస్తులు,60 గజాల్లో ఐదు అంతస్తులు, నిర్మించే స్థాయిలో నిర్మాణాలు సాగుతున్నా, సంబంధిత అధికారులు నిర్మాణ దశలోనే ఎందుకు అడ్డుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నిర్మాణం పూర్తయ్యాకే చర్యలాలి?**

అక్రమ నిర్మాణాలను మొదటి దశలోనే గుర్తించి నిలిపివేయాల్సిన అధికారులు,భవనాలు ఆకాశానికి తాకేలా నిర్మించే వరకు స్లాబులు కట్ చేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణం జరుగుతున్నప్పుడు చర్యలు తీసుకుంటే స్లాబులు కట్ చేసే పరిస్థితి ఎందుకు వచ్చేది.? అని ప్రశ్నిస్తున్నారు.

**ఇకనైనా నిఘా పెంచాలి**

అక్రమ నిర్మాణాలపై ఒక్కసారి చర్యలు తీసుకోవడం కాకుండా, నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచే నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్థానికులు కోరుతున్నారు. చిన్న స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవంతులు నిర్మించే విధానానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇచ్చిన హెచ్చరికలు మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.




**కింది స్థాయి సిబ్బంది నడవడిపై ఓ లుక్కేయాలి**

అక్రమ నిర్మాణాలు ఉన్నతాధికారుల దృష్టికి రాకుండా అంత కింది స్థాయి సిబ్బంది చక్కబెడుతున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి కిద్దిస్తాయి సిబ్బంది నడవడిపై ఉన్నతాధికారులు ఓ లుక్కేసి వారి వల్లనే తప్పిదాలు జరుగుతున్నాయని తేలితే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



# 27న ఉద్యోగ, ఉపాధ్యాయ మహాధర్నా

**- పిలుపునిచ్చిన టీఎస్‌యూటీఎఫ్**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వెంటనే పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంకటరత్నం పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 10న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# గుర్రంపోడులో రోడ్డు విస్తరణకు మార్కింగ్

**50 అడుగుల పరిధిలో ఇళ్లు, దుకాణాలు.. యజమానుల్లో ఆందోళన**

**ప్రజా వాయిస్,గుర్రంపోడు:**
ధర్వేశిపురం,మల్లెపల్లి ప్రధాన రహదారి విస్తరణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గుర్రంపోడు మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా కొలతలు వేసి మార్కింగ్ చేశారు. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 50 అడుగుల చొప్పున.. మొత్తం 100 అడుగుల మేర విస్తరణకు గీతలు గీశారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు వాహనాల రాకపోకలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ విస్తరణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.ధర్వేశిపురం, మల్లెపల్లి మార్గంలో ఇరుకైన రహదారి కారణంగా ఏళ్లుగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతోపాటు ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందని స్థానికులు, ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే మార్కింగ్ పరిధిలోకి అనేక ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు వస్తుండటంతో భవన యజమానులు, వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. రాబోయే రోజుల్లో మార్కింగ్ ఆధారంగా కూల్చివేతలు చేపడతారా? నష్టపరిహారం ఎలా ఉంటుంది? అనే చర్చ స్థానికంగా సాగుతోంది. రోడ్డు విస్తరణ అవసరమే అయినప్పటికీ, బాధితులకు న్యాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

**- పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు**
**- కోట్ పల్లి మండల విద్య అధికారి చంద్రప్ప**

**ప్రజావాయిస్/కోట్ పల్లి:**
కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయి డెంటల్ హాస్పిటల్, వికారాబాద్‌కు చెందిన వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కోటపల్లి మండల విద్యాధికారి చంద్రప్ప ఓ ప్రకటన లో తెలిపారు. పరీక్షల్లో భాగంగా సుమారు 20 మంది విద్యార్థులకు అత్యవసర దంత చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి సాయి డెంటల్ హాస్పిటల్‌ను సంప్రదించి అవసరమైన చికిత్స పొందాలని వైద్య సిబ్బంది సూచించినట్లు మండల విద్యాధికారి తెలిపారు.విద్యార్థుల్లో దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, చిన్న వయస్సులోనే దంత సమస్యలను గుర్తించి తగిన చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో సాయి డెంటల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిపి మండల్ ఆశయ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ప్రజా వాయిస్,మోత్కూరు,(ఆగష్టు25) :**
బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వరి ప్రసాద్ మండల్ ( బిపి మండల్ ) ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం బిపి మండల్ 18వ జయంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీకాంత్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి (బి.ఆర్.ఎస్.ఎస్ ) మండల శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో 1979 లో బిపి మండల్ బీసీ కమీషన్ గా కొనసాగిన సమయంలో ఆయన కొనసాగిన సిఫార్సులను నేటి పాలక ప్రభుత్వాలు అమలు చేస్తే ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో కూడా రిజర్వేషన్లు పొందగలరని,రాజ్యాధికారంలో కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సీట్ల పెంపు జరిగేవని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు మండల,పట్టణ అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్,నిలిగొండ మత్స్యగిరి, మండల నాయకులు నల్ల సతీష్,వాడపల్లి నరేష్ తొంట ఉప్పలయ్య,బోడ భాస్కర్, బుంగ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# వనమహోత్సవం ఒక సామాజిక బాధ్యత

**.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

**ప్రజా వాయిస్ మహబూబాబాద్**
అధికారులతో కలిసి మొక్క నాటిన జిల్లా కలెక్టర్ స్నేహాశబరీష్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకలెక్టర్ స్నేహశబరిష్ అటవీశాఖ అధికారి బి లావణ్య తో కలిసి ఈదులపూసపల్లి లేక్ వ్యూ నేచర్ పార్క్, చెరువు ప్రాంతంలో మొక్క నాటి, నీరు పోశారు. ఈ..కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఏ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, ఎఫ్ ఆర్ ఓ సురేష్, మహబూబాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ జ్యోతి, మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, స్థానిక కౌన్సిలర్, మీడియా ప్రతినిధులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**- నవాబుపేట్‌లో టీయూడబ్ల్యూజే హెచ్143 సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**ప్రజావాయిస్/నవాబు పేట్:**
వికారాబాద్ జిల్లా నవాబు పేట్ మండలంలో మంగళవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కన్వీనర్ ఎం. రవీందర్, కో-కన్వీనర్లు టి. ఆనంద్, సయ్యద్ జావీద్, రాజు, సంతోష్, వికారాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు కే. గోపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నవాబు పేట్ మండలానికి చెందిన జర్నలిస్టులు సమావేశమై, వృత్తిపరంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను యూనియన్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. జర్నలిస్టులు కలిసికట్టుగా పనిచేస్తూ తమ సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, టి యు డబ్ల్యూ జే హెచ్ 143 రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నియోజకవర్గ అధ్యక్షుడు కే. గోపాల్, జిల్లా కన్వీనర్ ఎం. రవీందర్ లు పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కార్యనిర్వహక అధ్యక్షుడు అరుణ్ రెడ్డి పన్నాల,సంయుక్త కార్యదర్శి వి.రామకృష్ణాచారి,యూనియన్ సభ్యులు జగన్, నక్క అరుణ్, నవాబ్ పేట్ మండల విలేకరుల బృందం పాల్గొన్నారు.



# చేపూరు గ్రామంలో పచ్చదనానికి శ్రీకారం

**జిల్లా హార్టికల్చర్ అధికారి శేఖర్, ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం**

**మొక్కల సంరక్షణే లక్ష్యం.. ఆదర్శ గ్రామంగా చేపూరు తీర్చిదిద్దుతామన్న సర్పంచ్ మారపాక ఈశ్వరమ్మ**

**ప్రజా వాయిస్ :** గుర్రంపోడు మండలం,నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలోని చేపూరు గ్రామంలోపర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపే లక్ష్యంగా చేపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉద్యానవన అధికారి శేఖర్, మండల ప్రత్యేక అధికారి ఎంపీడీఓ మహేష్, ఉపాధి హామీ ఏపీఓ కంచర్ల గోపాల్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ మారపాక ఈశ్వరమ్మ కుమారుడు మారపాక నరేందర్, ఉప సర్పంచ్ ఏరుకొండ నర్సింహా, కుందూరు రాములు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చేపూర్‌ను పచ్చదనంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. సర్పంచ్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ గ్రామాన్ని సుందరమైన ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.




# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

**11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్**

**హుస్నాబాద్, ఆగస్ట్ 25....**
పరిసరాల పరిశుభ్రత తోనే వ్యాధులు దూరం అవుతాయని హుస్నాబాద్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ అన్నారు.మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డు సిపిఎస్ పాఠశాలలో వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ ఆధ్వర్యంలో సఫాయి అప్నా, బీమారీ భగావో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పాత టైర్లు, కుండలు, రంజాన్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడం ద్వారా డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించి ఆరోగ్యకరమైన వాతావరణం కోసం సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి,పాఠశాల అధ్యాపకులు,మున్సిపల్ ఎస్ఐ బాల ఎల్లం, జవాన్ ప్రభాకర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, ఆగస్టు 25:**
మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీవో అఫ్జలుద్దిన్, కళాశాల ప్రిన్సిపల్ మధుశ్రీవాస్తవ, మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గడ్డం నాగరాజు అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీూా, వీబీజీ రామ్‌జీ సంయుక్త ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మొక్కలను పెంచడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే వనమహోత్సవం ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సర్పంచ్ లు అనురాధ రమేష్, పంజా స్వామి, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, ఘూూా రాజు, ఫారెస్ట్ ఆఫీసర్ వేణు, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.